VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 15.06.2026
సంపుటి : 08 సంచిక : 06 , పేజీలు : 12 , వెలరూ . 5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com



**ఈనెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా రాక**

# వర్షాల పైన అప్రమత్తంగా ఉండాలి

- అలసత్వం ప్రదర్శించే అధికారులపైన కఠిన చర్యలు
- కోర్ అర్బన్ రీజియన్ లో మరింత అప్రమత్తంగా ఉండాలి
- వర్షం కారణంగా ట్రాఫిక్ జాం అయితే సహించను
- వర్షాల సమయంలో అధికారులు, పోలీసులు రోడ్ల పై ఉండాల్సిందే
- అవసరమైతే నేనూ రోడ్ మీదికి వస్తా..
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**

వర్షాల సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన తేల్చిచెప్పారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పేవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.జూన్ 9న కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు . వర్షాల సన్నద్ధతపై జూన్ 1న సమీక్ష నిర్వహించి తాను స్వయంగా అనేక సూచనలు చేశానని గుర్తుచేశారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.జూన్ 9న వర్షం సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపించిందన్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌లను ఆదేశించారు. మరో సారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

▶ మిగతా 2లో



## రేవంత్ పాలన ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్

- కాంగ్రెస్ హామీలు అమలు కాలేదు: కేటీఆర్

## జూన్ 15—17 తేదీలలో న్యూఢిల్లీలో వికసిత్ భారత్ యువ పార్లమెంట్ 2026




**న్యూఢిల్లీ, వెలుతురు జూన్ 2026:**

యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, మై భారత్ (MY Bharat) ద్వారా వికసిత్ భారత్ యువ పార్లమెంట్ 2026 కార్యక్రమం జూన్ 15 నుండి 17, 2026 వరకు న్యూఢిల్లీలో నిర్వహించబడుతోంది.

## రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు



- కేంద్ర, రాష్ట్రాలు కలిస్తేనే అభివృద్ధి సాధ్యం
- గత ప్రభుత్వ మూర్ఖత్వంవల్ల తెలంగాణ నష్టపోయింది

## నేటి నుంచే బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ప్రారంభం



# సింగరేణిపై దుష్ప్రచారం మానాలి: భట్టి విక్రమార్క

- బొగ్గు నిల్వల మాయంపై ఆరోపణలు నిరాధారమని స్పష్టం
- శ్రీరాంపూర్ ఓసీపీలో ఓపెన్‌హౌస్ నిర్వహించిన డిప్యూటీ సీఎం
- సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని హితవు
- బొగ్గు నిల్వలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్న భట్టి
- బొగ్గు రవాణాపై జీపీఎస్, విజిలెన్స్ నిఘా ఉందని వెల్లడి
- 'కిలో బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదు'
- ఎస్ఐఆర్ పేరుతో అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లనే లక్ష్యంగా చేసుకున్నారని విమర్శ
- 80 వేల మంది ఓటర్లు అన్‌మ్యాపింగ్ అయ్యారని వ్యాఖ్య
- సింగరేణిని కాపాడేది కాంగ్రెస్ మాత్రమేనని శ్రీధర్‌బాబు స్పష్టం



## సర్ పై కాంగ్రెస్ జూమ్ మీటింగ్...

- కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేసిన ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్
- జూమ్ మీటింగ్ లో పాల్గొన్న పలువురు మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, నియోజక వర్గ ఇంచార్జ్ లు ఇంచార్జ్ లు, మాస్టర్ ట్రైనర్లు



# మేధో తెలంగాణ కోసం కృషి చేద్దాం!

- ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే యువతకు ప్రజా ప్రభుత్వం ప్రోత్సాహం
- పోటీ పరీక్షలలో సమాకాలీన వార్తవిశ్లేషణల కోసం 'వార్షిక ' పుస్తకం విడుదల !

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**




ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలనే తెలంగాణ యువత ఆశలను సాకారం చేసే దిశగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, వివిధ పోటీ పరీక్షలలో యువత విజయం సాధించే దిశగా కావలసిన మెలకువలను, శిక్షణను ఉచితంగా అందిస్తూ "మేధో తెలంగాణ" సాధన దిశగా పయనిస్తోందని, దీనికోసం పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ రకాల పుస్తకాలను యువతకు అందుబాటులోకి తీసుకువస్తుందని బీసీ సంక్షేమం,రవాణా శాఖ మాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ అన్నారు.పోటీ పరీక్షలలో కరెంట్ అఫైర్స్ కు అత్యంత ప్రాధాన్యత ఉందని, దాదాపు 20 నుంచి 25 శాతం ప్రశ్నలు సమకాలీన వార్తలు విశేషాల మీద అడుగుతున్నారని, ఈ నేపథ్యంలో అభ్యర్థులందరూ కరెంట్ అఫైర్స్ పైన సాధికారత సాధించే లాగా "వార్షిక 2025" పేరుతో 2025 సంవత్సరం లో జరిగిన జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలు, విశేషాలు, వ్యక్తులు సంఘటనలకు సంబంధించిన సమాహారంగా ఈ పుస్తకాన్ని రూపొందించామని, ఈ పుస్తకంలో రాబోయే ఎండోమెంట్స్ డిపార్ట్మెంట్ ఉద్యోగాలకు సంబంధించిన "భారతీయ వైదిక హైందవ విజ్ఞానం"

▶ మిగతా 9లో

## ప్రకాశం బ్యారేజీకి వరద నీరు.. నాలుగు గేట్లు ఎత్తి విడుదల

- మున్నేరు పరివాహక ప్రాంతాల్లో వర్షాల ప్రభావం
- విజయవాడ ప్రకాశం బ్యారేజీకి చేరుతున్న వరద ప్రవాహం
- నాలుగు గేట్లను అడుగుమేర ఎత్తిన అధికారులు
- 2,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల



## హైదరాబాద్‌లో గొంతెత్తిన కాక్రోచ్ జనతా పార్టీ

- నీట్ పేపర్ లీకేజీపై కేంద్రంపై ఆగ్రహం
- ధర్నాచౌక్‌లో భారీ ప్రదర్శన నిర్వహించిన యువత
- ఉద్యమంలో పాల్గొన్న సోనమ్ వాంగ్‌చుక్, ఆకునూరి మురళి



## మమతకు లీగల్ నోటీసులు.. టీఎంసీలో కలకలం

- సీఎం మమతా బెనర్జీకి డాక్టర్ బైద్యనాథ్ ఘోష్ నోటీసులు
- టీఎంసీ సీనియర్ నేతలకూ పరువు నష్టం హెచ్చరిక
- బరసత్ టికెట్ కోరానన్న ఆరోపణలను ఖండించిన బైద్యనాథ్
- బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- స్పందించకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక
- కకోలీ ఘోష్ కుటుంబంపై రాజకీయ దుమారం
- టీఎంసీని వీడిన కకోలీపై కొత్త ప్రచారానికి తెర
- పార్టీలో అంతర్గత విభేదాలు బహిర్గతమవుతున్నాయన్న చర్చ
- యువజన విభాగంలో సయోని ఘోష్ స్థానంలో అర్నబ్ బెనర్జీ నియామకం
- కీలక విభాగాల్లో పునర్వ్యవస్థీకరణ చేపట్టిన మమతా బెనర్జీ



## రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి

- తగ్గింపు ధరలే ఆకర్షణ.. దిగుమతుల్లో మరోసారి భారీ పెరుగుదల
- మే నెలలో 5.8 బిలియన్ యూరోల విలువైన రష్యా ఇంధనాల కొనుగోలు
- ప్రపంచంలో రష్యా ఇంధనాల రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్
- మొత్తం దిగుమతుల్లో 83 శాతం వాటా క్రూడ్ ఆయిల్‌దే
- నెలవారీగా రష్యా చమురు దిగుమతులు 21 శాతం పెరుగుదల
- విశాఖ, వడినార్, జామ్‌నగర్ రిఫైనరీల్లో పెరిగిన వినియోగం
- తగ్గింపు ధరలతో భారత రిఫైనరీలకు రష్యా చమురు ఆకర్షణ
- చైనా తర్వాత రష్యా క్రూడ్‌కు భారత్‌నే అతిపెద్ద మార్కెట్
- ఆంక్షలు ఉన్నా ప్రపంచ మార్కెట్లకు చేరుతున్న చమురు ఉత్పత్తులు



## జూన్ 15-17 తేదీలలో న్యూఢిల్లీలో...

(మొదటి పేజీ తరువాయి)

యువతలో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ నైపుణ్యాలు మరియు పరిపాలన పట్ల అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు మరియు కార్మిక & ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ నాయకత్వంలో నిర్వహించబడుతోంది.వికసిత్ భారత్ యువ పార్లమెంట్ కార్యక్రమం జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలలో మూడు దశలుగా నిర్వహించబడింది. తెలంగాణ రాష్ట్రంలో 31 జిల్లాల నుండి ఎంపికైన 155 మంది యువత రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలు మార్చి 28–29, 2026 తేదీలలో హైదరాబాద్‌లోని డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి. ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేష్ రంజన్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రింది ముగ్గురు పాల్గొనేవారు తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులుగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు:

కనకపూడి అఖిల (ఖమ్మం జిల్లా) – ప్రథమ స్థానం

జాధవ్ ప్రగతి (జగిత్యాల జిల్లా) – ద్వితీయ స్థానం

బి. సంధ్యారెడ్డి (హనుమకొండ జిల్లా) – తృతీయ స్థానం

జాతీయ స్థాయి కార్యక్రమంలో పార్లమెంటరీ చర్చలు, ప్రశ్నోత్తరాల సమయం (Question Hour), నాయకత్వ నైపుణ్యాలపై మాస్టర్‌క్లాసులు, పీఎం సంగ్రహాలయ సందర్శన, నూతన పార్లమెంట్ భవనం సందర్శన మరియు జూన్ 17, 2026న అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించబడనున్నాయి.ఈ కార్యక్రమాన్ని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా గారు జూన్ 16, 2026న న్యూఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ గారు పాల్గొంటారు.వికసిత్ భారత్ యువ పార్లమెంట్ యువతకు తమ నాయకత్వ ప్రతిభను ప్రదర్శించే వేదికగా నిలిచి, దేశాభివృద్ధిలో భాగస్వాములుగా మారేందుకు ప్రేరణనిస్తూ, వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు తోడ్పడే అవకాశాన్ని కల్పిస్తుంది.

## వర్షాల పైన అప్రమత్తంగా...

(మొదటి పేజీ తరువాయి)

వర్షం సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే నన్నారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని ముఖ్యమంత్రి అన్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని హెచ్చరించారు.వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు.వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు.వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు.ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సూచించారు.వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న asనేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యూరియా స్టాక్ , పంపణి కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

గతంలో తాగునీటి కాలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు.

నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు ముఖ్యమంత్రి సూచించారు. పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు.ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్ , వికాస్ రాజ్ ,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ శ్రీధర్, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ , వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి, సీఎంసీ కమిషనర్ సృజన , జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టీజీ ట్రాన్స్‌కో సీఎండీ డి. కృష్ణ భాస్కర్,టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీజితేష్ వి. పాటిల్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, అగ్నిమాపక శాఖ అదనపు డీజీ విక్రమ్ సింగ్ మాన్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం . రమేష్,హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, మేడ్చల్–మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## కాలేజీ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి: రాజనాల శ్రీహరి

**వరంగల్, వెలుతురు జూన్ 14:**



కాలేజీల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి ఉన్నత విద్య కోసం నగరాలకు వచ్చే విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకోవాల్సి వస్తోందని, దీంతో వారి తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. హాస్టల్ ఫీజులు, రవాణా ఖర్చులు భరించలేక అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తనను కలిసిన పలువురు విద్యార్థులు ఆర్థిక సమస్యలను వివరించారని, విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు ఉచిత బస్సు సౌకర్యం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పేద కాలేజీ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేశారు.

## రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు

- రేవంత్ రెడ్డి ప్రభుత్వం సహకరిస్తున్నందునే కేంద్రం నుండి నిధులొస్తున్నాయి
- గ్రామాల నుండి మండలాలు, నియోజకవర్గాలకు కనెక్ట్ చేసేలా రోడ్లను నిర్మిస్తున్నాం
- 7 ఏళ్లలో రూ.22 వేల కోట్ల నిధులు తీసుకొచ్చా
- రోడ్ల కోసమే రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో కరీంనగర్ ఎంపీ సెగ్మెంట్ ను అభివృద్ధి చేస్తున్నా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- ప్రభుత్వ విప్ తో కలిసి వేములవాడ సిరికొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి

**వేములవాడ వెలుతురు జూన్ 14:**

"రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయి. అట్లనే కేంద్రం, రాష్ట్రం కలిస్తేనే అభివృద్ధి సాధ్యం. గత ప్రభుత్వ మూర్ఖపు పాలనవల్ల తెలంగాణ చాలా నష్టపోయింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తున్నందువల్లే కేంద్రం నుండి నిధులొస్తున్నాయి. గ్రామాలకు మండలానికి కనెక్ట్ చేసేలా తగిన నిధులొస్తున్నాయి''అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గత ఏడేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.22 వేల కోట్ల నిధులు తీసుకొచ్చానని చెప్పారు.ఆదివారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం బొల్లారం గ్రామానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ తో కలిసి వేమలవాడ –సిరికొండ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బొల్లారం నుండి సిరికొండ వరకు రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆదిశ్రీనివాస్, బీజేపీ నేతలు ప్రతాప రామక్రిష్ణ, చెన్నమనేని వికాస్ రావు తదితరులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే.అభివృద్ది పనుల్లో భాగంగా సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ నుండి సిరికొండ వరకు దాదాపు 18.21 కి.మీల మేరకు రోడ్డు విస్తరణ, బలోపేతం చేసే పనులకు ఆదివారం రోజున స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారితో కలిసి శంకు స్థాపన చేయడం సంతోషంగా ఉంది. కేంద్రం CRIF (సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) కింద ఈ పనులకు 23 కోట్లు మంజూరు చేసింది. ఒప్పందం ప్రకారం... 6 నెలల్లో ఈ పనులను పూర్తి చేయాలని గడువు విధించడం జరిగింది. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా రహదారి విస్తరణ, బలోపేతం తోపాటు మధ్యమధ్యలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణం, పైప్ కల్వర్టుల నిర్మాణం, గ్రామాల పరిధిలో సీసీ డ్రైన్ల ఏర్పాటు, రోడ్డు భద్రతా చర్యలకు సంబంధించిన పనులు కూడా చేపట్టాల్సి ఉంది. మామిడిపల్లి, బావుసాయిపేట, రామన్నపల్లి, గోవింద రావుపేట తండా గ్రామాలతోపాటు ఈ రోడ్డు నుండి వెళ్లే ప్రయాణీకులకు, వాహనదారులకు ఎంతో సమయం ఆదా అవుతుంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం. ఎన్నికల వరకే రాజకీయాలు. ఎన్నికల తరువాత గెలిపించిన ప్రజల కోసం నియోజకవర్గాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు పోతున్నాం. గత 7 ఏళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం 22 వేల కోట్లకుపైగా కేంద్ర నిధులు తీసుకొస్తే, అందులో రోడ్ల నిర్మాణం కోసమే 10 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు ఖర్చు చేసినం. అందులో భాగంగా మేడిపల్లి గోవిందారం, మల్యాల నుండి కాచారం రోడ్ల విస్తరణ పనులకు 45 కోట్ల రూపాయలు ఖర్చు చేసి విస్తరించాం.కేవలం జాతీయ రహదారుల విస్తరణ కోసమే 5 వేల కోట్ల రూపాయలు తీసుకొచ్చినం. దీంతోపాటు CRIF (సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్), జాతీయ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి మిగిలిన నిధులు తీసుకొచ్చి ఖర్చు చేస్తున్నం. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గంలో ఎంపీగా పనిచేసిన ఏ నాయకుడు కూడా ఈ స్థాయిలో నిధులు తీసుకువచ్చిన దాఖలాలు లేవు.

మీకు తెలుసు... ఇటీవల చొప్పదండి మండలం అర్నకొండ గ్రామం నుండి గోపాల్ రావు మీదుగా మల్యాల వరకు 50 కోట్ల రూపాయల వ్యయంతో 35 కి.మీల మేరకు సింగిల్ రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించే పనులను ప్రారంభించుకున్నం. మొత్తం 50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ రోడ్డును విస్తరించబోతున్నాం. జాతీయ రహదారుల విషయానికొస్తే... 2 వేల 147 కోట్లు నిధులతో కరీంనగర్–వరంగల్ నేషనల్ హైవే, 578 కోట్ల రూపాయలతో ఎల్కతుర్తి–సిద్దిపేట నేషనల్ హైవే పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. కరీంనగర్, జగిత్యాల ప్రజల చిరకాల వాంఛ గా ఉన్న కరీంనగర్– జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు కూడా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 2 వేల 3 కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది. ఈ విషయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూర్తిగా సహకరిస్తున్నారు. ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రిని కూడా కలిశాం. అతి త్వరలోనే పనులకు శ్రీకారం చుట్టబోతున్నాం. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కూడా సహకరిస్తున్నారు.

నేను మళ్లీ చెబుతున్నా.... రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయి. అట్లనే కేంద్రం, రాష్ట్రం కలిస్తేనే అభివృద్ధి సాధ్యం. రాష్ట్రం ప్రతిపాదనలు పంపితేనే కేంద్రం నిధులిస్తుంది. గత ప్రభుత్వానికి సోయి లేకపోవడంవల్ల, మూర్ఖపు పాలనవల్ల తెలంగాణ చాలా నష్టపోయింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తున్నందువల్లే కేంద్రం నుండి నిధులొస్తున్నాయి. గ్రామాలకు మండలానికి కనెక్ట్ చేసేలా తగిన నిధులిస్తోంది. ఎన్నికలప్పుడే రాజకీయాలు. ఎన్నికల తరువాత నా ధ్యాస, శ్వాస అంతా అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఇంకా పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా. గ్రామగ్రామాన, గల్లీగల్లీలో రోడ్లు వేయిస్తా. రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకుంటూ పార్లమెంట్ అభివృద్ధికి క్రుషి చేస్తా. కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే వివక్ష లేకుండా ఓటేసిన ప్రజల ఆకాంక్ష మేరకు చేయి చేయి కలుపుదాం... వేములవాడ, సిరిసిల్లసహా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం. కలిసి రావాలని అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులను, నాయకులను కోరుతున్నా.

## నాలా-రోడ్లు-యూజీడీ సమస్యలపై కొలన్ హన్మంత్ రెడ్డి పరిశీలన

**కుత్బుల్లాపూర్, వెలుతురు జూన్ 14:**

నియోజకవర్గంలోని బాచుపల్లి పరిధిలో ఉన్న సాయి నగర్, ఆదిత్య గార్డెన్స్ కాలనీలలో నెలకొన్న నాలా, రోడ్లు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యలను కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆదివారం పరిశీలించారు.స్థానిక ప్రజలతో కలిసి కాలనీల్లో పర్యటించిన ఆయన, నాలాల నిర్వహణ సరిగా లేకపోవడం, రోడ్లు దెబ్బతినడం, యూజీడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. కాలనీవాసుల సమస్యలను నేరుగా విని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.




ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, కాలనీల అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రేవంత్ పాలన ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్

- తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్
- రేవంత్ పాలనపై తీవ్ర విమర్శలు
- వేలాది ఇళ్ల కూల్చివేతలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్
- ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫల మైందన్న ఆరోపణ
- ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంతేనని విమర్శ
- ఖైరతాబాద్‌కు త్వరలో ఉపఎన్నిక వచ్చే అవకాశం ఉందన్న వ్యాఖ్య
- కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపు
- బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచన





**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన ఫస్టాఫ్ పూర్తిగా అట్టర్ ఫ్లాప్‌గా మారిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని మండిపడ్డారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వాటిలో చాలా వరకు ఇంకా అమలు కాలేదని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, వృద్ధులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో వేలాది మంది పేదల ఇళ్లను కూల్చివేసిందని ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజల ఆవేదనను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేదల జీవనోపాధిపై ప్రభావం చూపే చర్యలను ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపైనా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డేనని ఆరోపించారు. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు పెరుగుతున్నాయని, వాటి ప్రభావం పాలనపై పడుతోందని విమర్శించారు.ఖైరతాబాద్ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై కూడా కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఆ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని, బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

## సర్ పై కాంగ్రెస్ జూమ్ మీటింగ్...

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**

ఓటర్ మ్యాపింగ్, ★సర్★ జరిగే విధానం.. బిఎల్ఏ లు చేయాల్సిన పనులు, బి.ఎల్.ఓ చేస్తున్న పనులపై నిఘా.ఓటర్ మ్యాపింగ్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు తగిన సూచనలు చేశారు.మూడు పార్లమెంట్ నియోజక వర్గాలకు ఒక యూనిట్ గా అరగంట చొప్పున 6 జూమ్ మీటింగ్ లు జరిగాయి.ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఎంత శాతం ఓటర్ మ్యాపింగ్ జరిగింది.. మిగతా ఓటర్ మ్యాపింగ్ లో ఓట్ కోల్పోయిన వారిని గుర్తించి వారికి తిరిగి ఓట్ హక్కు కల్పించే అంశాలపై వివరించారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ లు మాట్లాడుతూ దేశంలో బీజేపీ, ఎన్నికల కమిషన్ లు కలిసి ఓట్ చోరీకి పాల్పడు తున్నాయని అప్రజాస్వామికంగా దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని విమర్శించారు. సర్ పేరుతో ఓట్ల పరిశీలన చేపట్టి కాంగ్రెస్ పార్టీ కి దేశంలో ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్లను చోరీ చేసి దొంగ తనంగా రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు.తెలంగాణ లో కూడా ఓట్ చోరీ చేసే అవకాశం ఉందని నియోజక వర్గాలలో నాయకులు చాలా అప్రమతంగా ఉండాలని అన్నారు. బిఎల్ఏ లు ఓట్ మ్యాపింగ్ ను లోతుగా పరిశీలించి ప్రతి నిజమైన ఓట్ ను కాపాడాలని సూచించారు.ఓట్ కనుక తొలగిస్తే వెంటనే తగిన ఆధారాలతో వాటిని తిరిగి దరఖాస్తు చేయించి పునరుద్ధరణ జరిగేలా చూడాలని సూచించారు. రాబోయే ఎన్నికలలో చాలా కీలకంగా ఉన్న దృశ్యా ప్రతి ఒక్క ఓటును కాపాడుకోవాలని అన్నారు.ఈ జూమ్ మీటింగ్ లకు కో ఆర్డినేటర్ గా నాయకులు గంప వేణు గోపాల్ వ్యవహరించగా ఎన్నికల కమిషన్ కు సంబంధించిన వివరాలను టీపీసీసీ ఎలెక్షన్ కమిషన్ చైర్మన్ రాజేష్ వివరించారు.కాగా ఇప్పటి వరకు 90 శాతం బిఎల్ఏ ట్రైనింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి.. ఇక నుంచి BLA2 లు క్షేత్ర స్థాయిలో 25 వ తేదీ నుండి ఇంటింటికి వెళ్తారు , ప్రతి 10 బూతులకు ఒక సూపర్ వేజర్ ని నియామకం చేస్తూ, ప్రతి అసెంబ్లీ కి ఒక కోఆర్డినేటర్ ని నియమించి, AERO, ERO లతో సమస్య పరిష్కారం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.ఇంకా జూమ్ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రి పొన్నం ప్రభాకర్, ట్రైనింగ్ సెల్ చైర్మన్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, పార్లమెంట్ల వారీగా డీసీసీ అధ్యక్షులు, ఎంపీ లు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# స్వేచ్ఛాయుత & నిష్పాక్షిక ఎన్నికలు భారతదేశంలో ఒక దూరమైన కలేనా

- డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**

ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడమే కాదు. ఆ ఓటును కాపాడే సంస్థలపై ప్రజలకు ఉన్న విశ్వాసమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం అని డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అన్నారు.ఇటీవలి కాలంలో ప్రతిపక్ష నాయకుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై దేశవ్యాప్తంగా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదే సమయంలో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు రాజకీయ నాయకులు ఇంకా అధికార కేంద్రాల్లో కొన సాగుతుండటం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది.ఎన్నికల సంఘం స్వతంత్రతపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ముఖ్యంగా నియామక ప్రక్రియ కార్యనిర్వాహక వ్యవస్థ ప్రభావంలో ఉందనే భావన బలపడుతుండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆందోళన కలిగించే అంశంగా మారింది.అలాగే ఈవీఎంలకు సంబంధించిన ఘటనలు, ఆరోపణలు మరియు వివాదాలు ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో మరిన్ని ప్రశ్నలను లేవనెత్తు తున్నాయి.

ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండేలా పారదర్శకత, జవాబుదారీతనం మరియు సంస్థాగత స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేయడం అత్యవసరం.సంస్థలపై విశ్వాసం దెబ్బతింటే జవాబుదా రీతనం బలహీనపడుతుంది. రాజ్యాంగ పరిరక్షణ వ్యవస్థలు రాజీపడినట్లు కనిపిస్తే ప్రజల మనసులో ఒక ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది–"ఎన్నికలు నిజంగా స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా జరుగు తున్నాయా? లేక ప్రజాస్వామ్యం పేరుతో ఒక నియంత్రిత వ్యవస్థలో మనం పాల్గొంటున్నామా?"ప్ర జాస్వామ్యాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. రాజ్యాంగ విలువలను, స్వతంత్ర సంస్థలను మరియు ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం మనందరి కర్తవ్యం.



# టీడబ్ల్యూజేఎఫ్ పై విచ్ఛిన్నకర శక్తుల విశృంకల విష ప్రచారం

- పాత్రికేయుల పక్షాన పోరాడే వారిదే సంఘం
- టీడబ్ల్యూజేఎఫ్ ఏ పార్టీకి, పత్రికకు అనుబంధం కాదు
- ఫెడరేషన్ మిత్రులకు నమస్కారం
- టీడబ్ల్యూజేఎఫ్‌పై జరుగుతున్న విష ప్రచారాలు – వాస్తవాలు ఇవే

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**

జర్నలిస్టు మిత్రులకు, ఫెడరేషన్ సభ్యులకు నా హృద యపూర్వక నమస్కారాలు. ఇటీవల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF) గురించి కొన్ని విచ్ఛిన్నకర శక్తులు, సంఘ వ్యతిరేక వ్యక్తులు ఉద్దేశపూ ర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో, వాస్తవాలను మీ ముందుంచాల్సిన బాధ్యత నాపై ఉంది.

### బలంగా టీడబ్ల్యూజేఎఫ్

రాష్ట్రవ్యాప్తంగా మన ఫెడరేషన్ అత్యంత బలంగా కొన సాగుతోంది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మనం నిరంతరం పోరాడుతున్నాం. ఇప్పటికే 22 జిల్లాల్లో జిల్లా మహాసభలను విజయవంతంగా పూర్తి చేసుకున్నాం.

జిల్లాల నుండి వచ్చిన సభ్యత్వ వివరాలతో కార్మిక శాఖకు వార్షిక నివేదికలను (Annual Returns) సమర్పించాం. మిగిలిన జిల్లాల మహాసభలు, రాష్ట్ర మహాసభలను కూడా అతి త్వరలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాం.

### మహాసభల ఆలస్యానికి కారణం

సంఘానికి సంబంధించిన కొన్ని కోర్టు కేసులు, జర్నలిస్టుల అక్రెడిటేషన్ అంశాలపై జరుగుతున్న న్యాయ పరమైన పోరాటాల దృష్ట్యా రాష్ట్ర మహాసభల నిర్వహణలో కొంత ఆలస్యం జరిగింది. ఇది కేవలం న్యాయపరమైన ప్రక్రియ మాత్రమే తప్ప, సంఘం బలహీ నపడటం కాదు.

### తప్పుడు ప్రచారాలను నమ్మకండి

"టీడబ్ల్యూజేఎఫ్ మాదేనని", "కార్మిక శాఖ గుర్తింపు మాకే వచ్చిందని" కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. నిజంగా వారికి గుర్తింపు వచ్చి ఉంటే, ఆ పత్రాలను బహిరంగంగా చూపి ఉండేవారు, విజయో త్సవాలు చేసుకునేవారు. కానీ, అలాంటిదేమీ జరగలేదు. ఇది వారు చేస్తున్న అసత్య ప్రచారానికి నిదర్శనం.

### వ్యవస్థాపక అధ్యక్షుడిగా నా బాధ్యత

ఈ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా, తెలంగాణ జర్నలిస్టుల ఉద్యమంలో ప్రత్యక్షంగా పనిచేసిన వ్యక్తిని నేను. జర్నలిస్టు సమాజానికి నా ప్రస్థానం సుపరిచితమే. నన్ను అనామకుడిగా చూపించే ప్రయత్నాలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను.

### సంఘ విచ్ఛిన్నానికి కారణమైన వారి తీరు

సంఘ బైలాకు విరుద్ధంగా, చట్టవిరుద్ధంగా నన్ను బహిష్కరించినట్లు ప్రకటించడం, బైలాలో లేని "యాక్టింగ్ ప్రెసిడెంట్" అనే పదవిని సృష్టించడం వంటి చర్యలతో వారు సంఘాన్ని తమ జేబు సంస్థలా మార్చు కోవాలని చూశారు. ఇటువంటి చర్యల వల్లే మనం న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది.

### కొనసాగుతున్న న్యాయపోరాటం

టీడబ్ల్యూజేఎఫ్ పేరును దుర్వినియోగం చేయకుండా, సంఘం బ్యాంకు ఖాతాలను ఇతరులు వాడకుండా సివిల్ కోర్టులో కేసు వేశాం. అలాగే, అక్రెడిటేషన్ కమిటీల్లో మనకు అన్యాయం జరగడంపై హైకోర్టులో మూడు కేసులు దాఖలు చేశాం. కోర్టులో కేసులు నడు స్తుండగానే, "బహిష్కరణ" అంటూ వారు చేస్తున్న ప్రచారం న్యాయవ్యవస్థను కించపరచడమే. అవసరమైతే వారిపై కోర్టు ధిక్కరణ చర్యలను కూడా పరిశీలిస్తాం.

### స్వచ్ఛందమే మన విధానం

ఎవరినీ మభ్యపెట్టి సభ్యత్వం తీసుకోవాలని మనం ఎప్పుడూ కోరలేదు. నాయకత్వంపై విశ్వాసం ఉన్నవారు స్వచ్ఛందంగా వస్తారు, ఇదే ప్రజాస్వామ్య పద్ధతి. సంఘాన్ని విచ్ఛిన్నం చేసినవారితో తప్ప, నాకు ఎవరితోనూ వ్యక్తిగత శత్రుత్వం లేదు. సంఘం బాగు కోసం తిరిగి రావాలనుకునే వారందరినీ నేను మనస్ఫూర్తిగా స్వాగతిస్తాను.

### అనుబంధాలకు అతీతం

టీడబ్ల్యూజేఎఫ్ ఏ రాజకీయ పార్టీకి, ఏ పత్రికకు, ఏ యాజమాన్యానికి అనుబంధం కాదు. ఇది కేవలం జర్నలిస్టుల హక్కుల కోసం మాత్రమే పనిచేసే స్వతంత్ర వేదిక. తెలంగాణ ఉద్యమ సమయంలో ట్రేడ్ యూనియన్‌గా మనం ఎలా పోరాడామో, ఇప్పటికీ అదే నిబద్ధతతో ఉన్నాం. పదేళ్లు పదవులు అనుభవించి, సంఘాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్న వారే నేడు మనపై విమర్శలు చేస్తున్నారు.

### తెలంగాణ చరిత్ర – టీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే తెలంగాణ జర్నలిస్టుల హక్కులు, ఆత్మగౌరవం, ప్రాంతీయ ఆకాంక్షల సాధన కోసం ఏర్పడిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (TWJU) (Regd. H-2843/2010) నేటి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF) కు మూలం.తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రప్రదేశ్ స్థాయి జర్నలిస్టు సంఘాలు ఉద్యమానికి దూరంగా ఉన్న సందర్భంలో, తెలంగాణ భావజాలం కలిగిన జర్నలిస్టులు ఏకమై ప్రత్యేక తెలంగాణ జర్నలిస్టుల వేదికగా టిడబ్ల్యూ జేయూను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక కార్యక్రమాలు, నిరసనలు, సమావేశాలు నిర్వహిస్తూ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు.నేడు టీడబ్ల్యూజేఎఫ్‌పై హక్కులు చెబుతున్న వారిలో చాలామంది ఆ సమయంలో తెలంగాణ ఉద్యమంలో గానీ, సంఘ నిర్మాణంలో గానీ భాగస్వాములు కాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సంఘంలోకి వచ్చి పదవులు పొందిన కొందరు వ్యక్తులు, అనంతరం సంఘాన్ని ఒక రాజకీయ పార్టీకి లేదా ఒక మీడియా సంస్థకు అనుబంధంగా మార్చే ప్రయత్నాలు చేశారు.అలాంటి కుట్రలను వ్యతిరేకిస్తూ, సంఘ స్వతంత్రతను కాపాడేందుకు మేము పోరాడాం. అదే క్రమంలో సంఘాన్ని విచ్ఛిన్నం చేసే చర్యలకు వ్యతిరేకంగా న్యాయపోరాటం కూడా కొనసాగుతోంది.టీ డబ్ల్యూజేఎఫ్ చరిత్ర తెలంగాణ ఉద్యమ చరిత్రతో ముడిపడి ఉంది. ఈ సంఘం ఏ వ్యక్తి సొత్తు కాదు, ఏ రాజకీయ పార్టీ అనుబంధ సంస్థ కాదు. ఇది తెలంగాణ జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, గౌరవం కోసం ఏర్పడిన స్వతంత్ర ట్రేడ్ యూనియన్.

### ఈ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను జర్నలిస్టు సమాజం ఎప్పటికీ అంగీక రించదు మన గెలుపు ఖాయం

ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎంతటి అవాస్తవాలను ప్రచారం చేసినా... ధర్మం, న్యాయం, చట్టం మన వైపే ఉన్నాయి. టీడబ్ల్యూజేఎఫ్ తన అసలు లక్ష్యాలతో, జర్నలిస్టుల సమస్యలపై అలుపెరగని పోరాటం కొనసా గిస్తుంది.విచ్ఛిన్నకర శక్తుల విష ప్రచారాలను నమ్మకండి. నిజాలు తెలుసుకోండి, సంఘాన్ని బలోపేతం చేయండి, జర్నలిస్టుల ఐక్యతను కాపాడండి.

**జై జర్నలిస్టు! జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి!!**



# స్వచ్ఛంద రక్తదాన సేవలకు గుర్తింపు.. డా. రాజేశ్వర్ రావుకు గవర్నర్ సత్కారం

**హైదరాబాద్, వెలుతురు జూన్ 14:**

రక్తదానం పట్ల సమాజంలో చైతన్యం కలిగిస్తూ, స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ

విశిష్ట సేవలందించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెడ్ క్రాస్ శాఖ చైర్మన్, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఓఎస్డీ డా. ఎస్.ఎం. రాజేశ్వర్ రావును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సత్కరించి పురస్కారాలు అందజేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో భారత రెడ్‌క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు. అనంతరం విశిష్ట సేవలందించిన వైద్యులు, అత్యధిక సార్లు రక్తదానం చేసిన దాతలు, రక్తదాన శిబిరాల నిర్వాహకులు, అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కింద భారత రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖకు విశేష సహకారం అందించిన సంస్థల ప్రతినిధులను గవర్నర్ సత్కరించి పురస్కారాలు అందజేశారు.స్వచ్ఛంద రక్తదానోద్యమంలో ప్రజలను భాగస్వాములను చేయడంలో, అవగాహన కల్పించడంలో డా. రాజేశ్వర్ రావు చేస్తున్న కృషికి గాను,



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ ఆయనను "హయ్యెస్ట్ బ్లడ్ డోనర్ మోటివేటర్ అవార్డు–2026"కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా గవర్నర్ చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు.డా. రాజేశ్వర్ రావు నాయకత్వంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెడ్ క్రాస్ శాఖ చేపట్టిన సేవా కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందు కుంటున్నాయి. 2023 మార్చి నుంచి 2026 మే వరకు 113 రక్తదాన శిబిరాలను నిర్వహించి 8,279 యూనిట్ల రక్తాన్ని సేకరించగా, ఆ రక్తం తలసేమియా, క్యాన్సర్ రోగులకు ఎంతో ఉపయోగపడింది. అలాగే 467 ఉచిత వైద్య శిబిరాల ద్వారా 24,142 మందికి పైగా వృద్ధులు, దివ్యాంగులు, గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు 20 సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమాల ద్వారా 1,865 మందికి శిక్షణ కల్పించారు. శామీర్‌పేటలో వృద్ధుల కోసం 'ప్రణామ్' డే కేర్ సెంటర్, బోయిన్‌పల్లిలో మిస్రీలాల్ మంగీలాల్ మాతా-శిశు ఆసుపత్రిని నిర్వహిస్తూ పేద కుటుంబాలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. వీటితో పాటు టీబీ ముక్త్ అభియాన్, ఆయుష్మాన్ భారత్ పథకం నమోదు, వరద బాధితులకు సహాయక చర్యలు, యువ రెడ్ క్రాస్ వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన సమర్థ వంతంగా అమలు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, శాంతిభద్రతల విభాగం డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ ప్రధాన కార్యదర్శి & సీఈఓ ప్రొఫెసర్ శ్రీరాములు, ట్రెజరర్ శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శశికిరణాచారి, లార్వెన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వరుణ్ విహార్, సీఈఓ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఇన్చార్జ్ మంత్రి చేతుల మీదుగా అల్పాహార పథకం ప్రారంభం

- విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ
- జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**



జిల్లాలో నేటి నుండి ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెట్టిన అల్పాహారం పథకం జిల్లాలోని మొదటి దశ లో భాగంగా 45 ప్రభుత్వ పాఠశాలలలో అమలు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ రాజ్ భవన్ పాఠశాలలో అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మన్నా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అమలు చేయనున్న ఈ పథకం మొదటి దశలో 45 పాఠశాలలలో మొత్తం 12,437 విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలలో డ్రాపౌట్ శాతం తగ్గించే దిశగా మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇందులో భాగంగా ఉదయం విద్యార్థులకు అందించే అల్పాహారం మెనూ లోని మిల్లెట్ ఇడ్లీ సాంబార్, మిక్స్డ్ వెజ్ కుర్మాతో పూరీ, చట్నీతో బోండా, ఉక్మా చట్నీ అలాగే దోస అందించడం జరుగుతుందని తెలిపారు.అలాగే నేడు జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలలలో విద్యాభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, అలాగే నోట్ పుస్తకాలు అందించనున్నట్లు విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఒమన్ తీరంలో మునిగిన భారత నౌక

- 14 మంది భారతీయులు సురక్షితం
- ఇంజిన్ వైఫల్యంతో సముద్రంలో మునిగి పోయిన 'విరాట్ 1'
- నౌకను వదిలి లైఫ్ రాఫ్ట్ ద్వారా ప్రాణాలు కాపాడుకున్న భారత సిబ్బంది


**ఇంటర్నెట్ డెస్క్, వెలుతురు జూన్ 14:**

ఒమన్ తీరంలో ఇంజిన్ వైఫల్యానికి గురై సముద్రంలో మునిగిపోతున్న ఒక భారతీయ నౌక నుండి 14 మంది భారతీయ సిబ్బందిని అత్యంత సురక్షితంగా ఖాళీ చేయించారు. భారతీయ పతాకంతో ప్రయాణిస్తున్న మెకనైజ్డ్ సెయిలింగ్ వెసెల్ 'విరాట్ 1' ప్రమాదానికి గురై, సిబ్బందిని రక్షించిన కొద్దిసేపటికే సముద్రంలో మునిగిపోయిందని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారికంగా ధృవీకరించింది. ఒమన్ ప్రాంతీయ రక్షణ విభాగాలు మరియు ఆ పరిసరాల్లో ఉన్న ఇతర నౌకల సమన్వయంతో ఈ అత్యవసర రెస్క్యూ ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది.

నౌక సముద్రం నడిబొడ్డున ఉన్న సమయంలో అకస్మాత్తుగా ఇంజిన్ విఫలం కావడంతో నియంత్రణ కోల్పోయిందని రాయబార కార్యాలయం తెలిపింది. నౌక మునిగిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన సిబ్బంది, వెంటనే దానిని వదిలిపెట్టి సముద్ర రక్షణ విమానం ద్వారా కిందకు దించిన లైఫ్ రాఫ్ట్ సహాయంతో సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. "భారతీయ నౌక విరాట్ 1 ప్రమాదానికి గురైనట్లు సమాచారం అందగానే ఒమన్ అధికారులతో కలిసి రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించాం. సిబ్బంది అంతా సురక్షితంగా లైఫ్ రాఫ్ట్‌కు మారారు" అని భారత ఎంబసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మారిటైమ్ ఏజెన్సీలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.

గత వారం రోజులుగా గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో భారతీయ సిబ్బందితో వెళ్తున్న మూడు విదేశీ నౌకలపై అమెరికా నావికాదళం దాడులు చేసిన ఘటనల నేపథ్యంలో ఈ తాజా ప్రమాదం తీవ్ర కలకలం రేపింది.


అయితే, ఈ నౌక ప్రమాదానికి అమెరికా దాడులకు ఎలాంటి సంబంధం లేదని, ఇది కేవలం ఇంజిన్ వైఫల్యం వల్ల జరిగిన ప్రమాదం మాత్రమేనని అధికారులు స్పష్టం చేశారు. గతంలో జరిగిన దాడులను భారతదేశం తీవ్రంగా పరిగణించి, అమెరికాకు తన దౌత్యపరమైన నిరసనను కూడా తెలియ జేసింది. ఏదేమైనా, తాజా ప్రమాదంలో 14 మంది భారతీయులు ప్రాణాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



# కేశవరావు జాదవ్‌ను మరచిపోవడం అంటే తెలంగాణను మరచిపోవడమే

**ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ 8.వ వర్ధంతి సందర్భంగా**

ఒక సమాజం తన చరిత్రను ఎలా గుర్తుంచుకుంటుందో, తనను తాను కూడా అలా నిర్వచించుకుంటుంది. ఉద్యమాలను నడిపిన నాయకులను, ఆలోచనలను నిర్మించిన మేధావులను, ప్రజల్లో చైతన్యాన్ని రగిలించిన తత్వవేత్తలను గౌరవించే సంస్కృతి ఉన్న సమాజాలే తమ భవిష్యత్తును సక్రమంగా నిర్మించుకోగలుగుతాయి. కానీ చరిత్రను కేవలం అధికారంలో ఉన్నవారి పేర్లకే పరిమితం చేసి, ఉద్యమాల వెనుక ఉన్న అసలైన ఆలోచనా శక్తులను మరచిపోతే, ఆ సమాజం తన మూలాలను కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది. తెలంగాణ రాష్ట్ర సాధన చరిత్రను పరిశీలించినప్పుడు మనకు ఎదురయ్యే అత్యంత బాధాకరమైన ప్రశ్న ఇదే, తెలంగాణ ఉద్యమానికి మేధోబలం అందించిన మహనీయులను మనం నిజంగా గౌరవించామా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికేటప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే పేరు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక భావజాలం. ఒక ఉద్యమానికి ఆలోచనా పునాది వేసిన చింతనాపరుడు. ప్రజలలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని నింపిన తత్వవేత్త. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించడానికి అనేకమంది కృషి చేసినా, ఆ ఉద్యమానికి నిరంతర స్ఫూర్తిగా నిలిచిన వారిలో కేశవరావు జాదవ్ అగ్రగణ్యులు.తెలంగాణ అనే ఆలోచన రాజకీయ నినాదంగా మారకముందే, అది ఒక సామాజిక అవసరమని గుర్తించిన మేధావుల్లో ఆయన ముందువరుసలో ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే తెలంగాణ ప్రజల జీవన వాస్తవాలను లోతుగా అధ్యయనం చేశారు. విద్యార్థులకు కేవలం పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడిగా కాకుండా, సమాజాన్ని చదివే గురువుగా నిలిచారు. తెలంగాణ ప్రాంతం ఎదుర్కొంటున్న వివక్షను, అవకాశాల అసమాన పంపిణీని, సాంస్కృతిక అవమానాలను ఆయన చాలా తొందరగానే గుర్తించారు.1969 తెలంగాణ ఉద్యమం నుండి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ఆయన పాత్ర నిరంతరాయంగా కొనసాగింది. ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న రోజుల్లోనూ, ఉద్యమం మందగించిన కాలంలోనూ ఆయన తన నిబద్ధతను కోల్పోలేదు. తెలంగాణ కోసం పోరాడటం ఆయనకు రాజకీయ అవసరం కాదు, అది జీవిత ధ్యేయం. ఆ ధ్యేయం కోసం ఆయన అనేకసార్లు అరెస్టయ్యారు. మొత్తం 17 సార్లు జైలుకు వెళ్లి, రెండు సంవత్సరాలు కారాగార జీవితం గడిపారు. కానీ ఉద్యమం పట్ల ఆయన విశ్వాసం ఎప్పుడూ తడబడలేదు.ఒక ఉద్యమం విజయవంతం కావడానికి కేవలం రాజకీయ నాయకత్వం సరిపోదు. దానికి తాత్విక దిశ, మేధోపరమైన బలం, సాంస్కృతిక చైతన్యం కూడా అవసరం. తెలంగాణ ఉద్యమానికి ఆ బలాన్ని అందించినవారిలో కేశవరావు జాదవ్ ప్రత్యేక స్థానం సంపాదించారు. తెలంగాణకు ప్రత్యేక భాష, ప్రత్యేక సంస్కృతి, ప్రత్యేక చరిత్ర ఉన్నాయని ఆయన ఎప్పటికప్పుడు ప్రజలకు గుర్తు చేశారు. తెలంగాణ మాండలికాన్ని చిన్నచూపు చూసే ధోరణులను తీవ్రంగా వ్యతిరేకించారు. భాష అనేది కేవలం సంభాషణ సాధనం కాదని, అది ఒక ప్రాంతపు ఆత్మ అని ఆయన విశ్వసించారు.తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర ఎంత కీలకమో అందరికీ తెలిసిందే. అయితే ఆ విద్యార్థుల్లో ఉద్యమ చైతన్యాన్ని నింపిన వారిలో కేశవరావు జాదవ్ పాత్ర అపారమైనది. ఆయన ప్రసంగాలు విన్న తరాలు తెలంగాణ గురించి కొత్తగా ఆలోచించడం ప్రారంభించాయి. ఆయన మాటల్లో ఆవేదన ఉండేది, విశ్లేషణ ఉండేది, ఆశ ఉండేది. తెలంగాణను ఒక తల్లిగా ఊహిస్తూ ఆయన చేసిన ప్రసంగాలు ప్రజల గుండెలను తాకేవి. ఉద్యమం కేవలం రాజకీయ పోరాటం మాత్రమే కాదని, అది ఆత్మగౌరవ పోరాటమని ఆయన ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు.ప్రొఫెసర్ జయశంకర్‌తో కలిసి తెలంగాణ ఆలోచనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన విశేష కృషి చేశారు. మలిదశ ఉద్యమంలో తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ వంటి వేదికల ద్వారా వివిధ ఉద్యమ సంస్థలను, రాజకీయ శక్తులను ఏకం చేయడానికి ప్రయత్నించారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడుతున్న శక్తుల మధ్య ఐక్యత అవసరమని ఆయన నమ్మారు. ఉద్యమం ఏ




ఒక్కరి సొత్తు కాదని, అది ప్రజల సమిష్టి సంకల్పమని ఆయన విశ్వసించారు.అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన మేధావులకు తగిన గౌరవం దక్కిందా? ఉద్యమానికి ఆలోచనా పునాది వేసిన వ్యక్తులను ప్రభుత్వం గుర్తించిందా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పాలంటే నిరాశ కలుగుతుంది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమంలో పాల్గొన్న అనేక రాజకీయ నాయకులు అధికార పదవులు పొందారు. ఉద్యమానికి సంబంధించిన అనేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. కానీ ఉద్యమానికి మేధోబలం అందించిన మహనీయుల పేర్లు మాత్రం క్రమంగా ప్రజా చర్చల నుంచి కనుమరుగవుతున్నాయి. ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ వంటి వ్యక్తుల సేవలను అధికారికంగా గుర్తించడంలో రాష్ట్రం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇది కేవలం ఒక వ్యక్తిని మరచిపోవడం కాదు. ఇది తెలంగాణ ఉద్యమ ఆత్మను మరచిపోవడం. తెలంగాణ కోసం పోరాడిన మేధావులను విస్మరించడం అంటే తెలంగాణ ఉద్యమం వెనుక ఉన్న విలువలను విస్మరించడం. ఉద్యమ చరిత్రను రాజకీయ నాయకుల పేర్లకే పరిమితం చేయడం ద్వారా అసలైన చరిత్రను వక్రీకరించే ప్రమాదం ఉంది. ఒక రాష్ట్రం తన మహనీయులను ఎలా గౌరవిస్తుందో అదే దాని సాంస్కృతిక పరిపక్వతకు సూచిక. ఈ విషయంలో తెలంగాణ ఇంకా చేయాల్సిన పని చాలా ఉంది. ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ పేరుతో పరిశోధనా కేంద్రాలు, గ్రంథాలయాలు, భాషా అధ్యయన సంస్థలు, సాహిత్య పురస్కారాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆయన రచనలు, ప్రసంగాలు, ఆలోచనలను సేకరించి భవిష్యత్తు తరాలకు అందించాలి.ముఖ్యంగా తెలంగాణ పాఠ్యపుస్తకాలలో ఆయన జీవితాన్ని, కృషిని చేర్చాలి. తెలంగాణ చరిత్రను నేర్చుకునే ప్రతి విద్యార్థి కేశవరావు జాదవ్ గురించి తెలుసుకోవాలి. తెలంగాణ అంటే ఏమిటి, తెలంగాణ ఉద్యమం ఎందుకు అవసరమైంది, ఆ ఉద్యమాన్ని ముందుకు నడిపిన ఆలోచనలు ఏమిటి అనే విషయాలను అర్థం చేసుకోవాలంటే ఆయన ఆలోచనలను అధ్యయనం చేయడం అవసరం.నేడు విశ్వవిద్యాలయాలు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిశీలించినప్పుడు కూడా కేశవరావు జాదవ్ వంటి మేధావుల అవసరం ఎంత ఉందో అర్థమవుతుంది. విశ్వవిద్యాలయాల బలం కేవలం భవనాలు, నిధులు, ఉద్యోగాలు మాత్రమే కావు. అవి నిలబెట్టే విలువలు, ఆలోచనలు, సామాజిక బాధ్యతలే అసలైన బలం. తెలంగాణ విశ్వవిద్యాలయాలు తమ ఉద్యమ మూలాలను గుర్తుచేసుకుంటేనే అవి తిరిగి తమ వైభవాన్ని పొందగలవు.జూన్ 16 ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ ఎనిమిదవ వర్ధంతి. ఇది కేవలం ఒక మహనీయుడిని స్మరించుకునే రోజు మాత్రమే కాదు. తెలంగాణ తనను తాను ప్రశ్నించుకోవాల్సిన రోజు కూడా. తెలంగాణ ఉద్యమం కోసం జీవితాన్ని అంకితం చేసిన వారిని మనం నిజంగా గౌరవిస్తున్నామా? వారి ఆలోచనలను మనం కొనసాగిస్తున్నామా? లేక వారిని కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేస్తున్నామా?తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం ఒక చారిత్రక విజయం. కానీ ఆ విజయానికి మూలమైన ఆలోచనలను, త్యాగాలను, మేధోసంపదను కాపాడుకోవడం ఇంకా పెద్ద బాధ్యత. ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ వంటి మహనీయులను గుర్తుంచుకోవడం అంటే కేవలం గతాన్ని గౌరవించడం కాదు, తెలంగాణ భవిష్యత్తును బలోపేతం చేయడం కూడా.

తెలంగాణ మట్టిలో ఆయన పేరు చెరగని అక్షరాలతో లిఖించబడి ఉంది. తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన ఒక ఉద్యమ స్ఫూర్తిగా జీవిస్తూనే ఉంటారు. అధికారాలు మరచిపోవచ్చు. రాజకీయాలు విస్మరించవచ్చు. కానీ తెలంగాణ ఆత్మలో కలిసిపోయిన కేశవరావు జాదవ్ వంటి మహనీయులను చరిత్ర ఎప్పటికీ మరచిపోదు. తెలంగాణ అనే బంగారు గ్రంథంలో మొదటి పేజీల్లో నిలిచిపోయే పేరు ఆయనది. ఆ పేరును సజీవంగా ఉంచడం తెలంగాణ సమాజం మీద ఉన్న చారిత్రక బాధ్యత.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

## సాలార్ జంగ్ మ్యూజియం 75వ స్వర్ణోత్సవ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**

భారతదేశ చరిత్ర, సంస్కృతి, కళా వైభవానికి ప్రతీకగా నిలిచిన సాలార్ జంగ్ మ్యూజియం 75వ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉంది.ప్రపంచంలోనే ఒక వ్యక్తి సేకరించిన అత్యంత అరుదైన కళాఖండాలు, పురావస్తు సంపదను కలిగి ఉన్న మ్యూజియంలలో సాలార్ జంగ్ మ్యూజియం ఒక విశిష్ట స్థానం సంపాదించుకుంది.నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ (సాలార్ జంగ్-III) గారి దూరదృష్టి, కళల పట్ల ఆయనకున్న అభిరుచి కారణంగానే ఈ అపూర్వ సంపద నేటి తరాలకు అందుబాటులో ఉంది.ఈ మ్యూజియం కేవలం పురాతన వస్తువుల నిలయం మాత్రమే కాదు. ఇది భారతదేశ వైవిధ్యభరిత సంస్కృతికి, ప్రపంచ నాగరికతల చరిత్రకు ఒక సజీవ సాక్ష్యం.ఇక్కడ ఉన్న ప్రతి కళాఖండం ఒక కథ చెబుతుంది, ప్రతి గ్యాలరీ మనల్ని చరిత్రలోకి తీసుకెళ్తుంది.గత 75 సంవత్సరాలుగా సాలార్ జంగ్ మ్యూజియం లక్షలాది మంది సందర్శకులకు జ్ఞానాన్ని, చరిత్రను, కళాసౌందర్యాన్ని పరిచయం చేస్తూ ఒక సాంస్కృతిక విశ్వవిద్యాలయంగా సేవలందిస్తోంది. హైదరాబాద్ గంగా జమున తహసీబ్ లాగా అన్ని మతాల నిలయం.తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్ర వారసత్వ సంపదను పరిరక్షించేందుకు, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయేందుకు ప్రత్యేక ప్రాధాన్యత



ఇస్తోంది. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగా ఇటువంటి చారిత్రక సంస్థలకు సంపూర్ణ సహకారం అందిస్తాము.స్వర్ణోత్సవం అనేది కేవలం గత విజయాలను గుర్తుచేసుకునే సందర్భం మాత్రమే కాదు. భవిష్యత్ తరాలకు మన వారసత్వాన్ని మరింత భద్రంగా, ఆధునిక సాంకేతికతతో అందించే బాధ్యతను గుర్తుచేసే సందర్భం కూడా.ఈ సందర్భంగా సాలార్ జంగ్ మ్యూజియం అభివృద్ధికి కృషి చేసిన మాజీ, ప్రస్తుత అధికారులు, సిబ్బంది, కళా పరిశోధకులు మరియు సంస్కృతి ప్రేమికులందరికీ నా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను.సాలార్ జంగ్ మ్యూజియం మరిన్ని శతాబ్దాల పాటు కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షిస్తూ అందరికీ స్వర్ణోత్సవ శుభాకాంక్షలు.

## ప్రమాదకర పురుగుమందులను నిషేధించాలి

**తెలంగాణ రైతు సంఘం డిమాండ్**
**హైదరాబాద్, వెలుతురు జూన్ 14:**

ప్రమాదకర పురుగుమందులు, కలుపుమందులపై సంపూర్ణ నిషేధం విధించి రైతులను ప్రభుత్వం రక్షించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ పంటలను రక్షించుకునే క్రమంలో రైతులు వినియోగిస్తున్న విషపూరిత పురుగుమందులు రైతులు, వ్యవసాయ కూలీలు, వారి కుటుంబ సభ్యులు, గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రసాయన పురుగుమందులు, కలుపుమందుల వినియోగం వల్ల క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, చర్మవ్యాధులు, రక్తహీనత, నాడీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని పలు అధ్యయనాలు, వైద్య నిపుణుల హెచ్చరికలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులను కార్పొరేట్ కంపెనీల రసాయన ఉత్పత్తులపై ఆధారపడేలా చేయడం సరికాదని విమర్శించారు.రైతులు, వ్యవసాయ కూలీల ఆరోగ్యంపై పెస్టిసైడ్ల ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు ప్రత్యేక వైద్య కమిషన్ ఏర్పాటు చేయాలని, పురుగుమందుల విక్రయాలపై కఠిన నియంత్రణలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అత్యంత విషపూరితమైన పురుగుమందులను పూర్తిగా నిషేధించి, జిల్లా ఆసుపత్రుల్లో “పెస్టిసైడ్ టాక్సికాలజీ” చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.అదే విధంగా రైతులకు రక్షణ పరికరాలను సబ్సిడీపై అందించడంతో పాటు, పురుగుమందుల ప్రభావంతో అనారోగ్యానికి గురైన రైతులు, వ్యవసాయ కూలీలకు ఉచిత వైద్యం, ప్రత్యేక ఆరోగ్య బీమా, నష్టపరిహారం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.రసాయన అవశేషాలు లేని సురక్షిత ఆహార ఉత్పత్తికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని కోరిన సంఘం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వ్యవసాయ విధానాల కోసం రైతులు, వ్యవసాయ కూలీలు, వైద్యులు, శాస్త్రవేత్తలు, ప్రజాసంఘాలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చింది.

# ఈనెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా రాక

- **నల్గొండ జిల్లా, కనగల్ మండలంలో 14,000 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్రంలో నిర్మించనున్న హ్యాం రోడ్లకు శంకుస్థాపన.**
- **లక్ష మందితో భారీ బహిరంగ సభ.**
- **బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**నల్లగొండ వెలుతురు జూన్ 14:**

ఈనెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రంలో 14 వేల కోట్ల రూపాయల వ్యయంతో హ్యాం పద్ధతిలో నిర్మించనున్న డబుల్ రోడ్ల పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న బహిరంగ సభ స్థలాన్ని ,హ్యాం రోడ్ల పైలాన్, హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ 17వ తేదీ మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి నల్గొండ జిల్లా, కనగల్ మండలం రానున్నారని ,రాష్ట్ర చరిత్రలోనే కని విని ఎరగని రీతిలో ఒకే రోజున ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని రహదారులను డబుల్ రోడ్లుగా మార్చే మొదటి ప్యాకేజీ కనగల్ మండలం, ధర్వేశిపురం నుండి డిండి వరకు నిర్మించే రహదారి తో రాష్ట్రంలోని అన్ని హ్యాం రోడ్లకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ బి రహదారులతోపాటు, మరో 7 వేల కోట్ల రూపాయలతో గ్రామాల నుండి మండలాలకు, మండలాల నుండి జిల్లా కేంద్రం వరకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్లు నిర్మించనున్నామని, వీటికి వచ్చేవారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు .రెండు సంవత్సరాలలో హ్యాం రోడ్లన్నింటిని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రోడ్లు ఉంటేనే పరిశ్రమలు, సంక్షేమ ఉంటాయని, అందువల్ల గడచిన సంవత్సరం కాలంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేసి రిజర్వాంట్ ద్వారా అప్పుగా నిధులు తీసుకుని రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు.నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేసే ఎస్ఎల్ బి సి సొరంగం కూడా హ్యాం రోడ్లు పూర్తయ్యేలోగా అంటే 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. దీని ద్వారా జిల్లాలో రెండు పంటలకు సాగు నీరు అందుతుందన్నారు. ఇది తన కలల ప్రాజెక్టు అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వీటితోపాటు, ఏఆర్పి కాలువలల లైనింగ్ కు 450 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని, ఈ శంకుస్థాపన కార్యక్రమం కూడా అదేరోజు ఉంటుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే హ్యాం రోడ్లను 34 ప్యాకేజీలుగా విభజించి 6300 కిలోమీటర్ల రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు ,నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో తాగునీటిపై ప్రత్యేక నిధులు మంజూరు చేయించడం జరిగిందని, ఈ పనులకు కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి కనగల్ లోనే శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగా ఈ సంవత్సరం నల్గొండ నియోజకవర్గంలో అత్యధికంగా 2,40,000 మెట్రిక్ టన్నుల దాన్యం పండించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 1800 కోట్ల రూపాయల విలువచేసే ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. రోడ్లు బాగుంటేనే పరిశ్రమలు, వ్యవసాయం వస్తాయని, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. కేంద్ర సిఆర్ఎఫ్ నిధుల ద్వారా నల్గొండ నుండి దర్వేశిపురం వరకు స్ట్రెయిట్ రోడ్ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని, కనగల్ జంక్షన్ అభివృద్ధి ని కూడా హ్యాం రోడ్ల లో పెట్టడం జరిగిందన్నారు. వీటితోపాటు, హైదరాబాద్ నుండి విజయవాడ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే కూడా మంజూరు అయిందని, ఇదేకాక దాని పక్కనే బుల్లెట్ ట్రైన్ డిపిఆర్ కూడా సిద్ధమవుతున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న సభకుసుమారు లక్ష మంది ప్రజలు ఈ సభకు హాజరు కానున్నట్లు మంత్రి వెల్లడించారు.ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని , ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు లేకుండా, బహిరంగ సభకు హాజరయ్యే ప్రజల కోసం అవసరమైన తాగునీరు, టెంట్లు, వాహనాలు ,ఇతర అన్ని సౌకర్యాలు సమకూర్చాలని, ఎవరు ఇబ్బంది పడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సభా వేదిక, వాహనాల పార్కింగ్ ,లైటింగ్ ,లైవ్ టెలికాస్ట్, అలాగే ఇతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. అంతేకాక పైలాన్ నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి కార్యక్రమం విజయవంతం అయ్యేలా అధికారులు, అనధికారులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా రైతు రుణమాఫీ తో పాటు, రైతు భరోసా ఇస్తున్నదని, మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు ఉచిత బస్సు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం, అలాగే 200 కోట్ల రూపాయలతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటివి చేపట్టినట్లు వెల్లడించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్ ,జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి ,డిపిఓ శంకర్ నాయక్, డిఎస్పి శివరాం రెడ్డి , ఆర్ అండ్ బి డి ఈ గణేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు , మండల స్థాయి అధికారులు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



# కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉక్కుల అశోక్ నియామకం

- ఎమ్మెల్యే సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందజేత
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అశోక్

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 14:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ లో సంస్థాగత నియామ కాల ప్రక్రియలో భాగంగా ఎస్సీ సెల్ రాష్ట్రకమిటీలో కీలక నియామకం జరిగింది పార్టీ అధిష్టానం మనకొండూరు శాసనసభ్యులు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయ ణ సిఫార్సు మేరకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చింతపల్లి కూడా గ్రామానికి చెందిన డాక్టర్ ఉ క్కుల అశోక్‌ను టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శిగా నియమించారుఈ సందర్భంగా ఎ మ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు ఈ సందర్భంగా ఉక్కుల అశోక్ మాట్లాడుతూ తనపై విశ్వాసంఉంచి ఈబాధ్యతను అప్పగించిన పా ర్టీ అధిష్టానానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తె లిపారురాజకీయంగా ఎల్లప్పుడూ తనకు మార్గనిర్దేశంచేస్తూ ప్రోత్సాహం అందిస్తున్న ఇబ్రహీంప ట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి అలాగే ఈ అవకాశం దక్కడంలో సహక రించిన అంకిత్ హా స్పిటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ అనురాధకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారుఅనంతరం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలోమర్యాదపూర్వకంగా కలి సి ఉక్కుల అశోక్ శాలువాతో సన్మానించారు ఈసందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిఈ మా ట్లాడుతూ టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఉక్కుల అశోక్‌కు శుభా కాంక్షలు తెలిపారు పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు చేరువై సేవలందించాలని సూచించారుభవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులుఅధిరోహించాలని ఆకాం క్షించారుతనకు అప్పగించిన పదవిని గౌరవంగా కాకుండా బాధ్యతగా స్వీకరిస్తున్నానని ఉక్కుల అశోక్ పేర్కొన్నారు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని డా క్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధనతో పాటు ఎస్సీ వర్గాల హక్కులు సంక్షేమం అభి వృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. సామాజికన్యాయం సాధనకు అలుపె రగని పోరా టం చేస్తూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబె ట్టుకుంటానని స్పష్టంచేశారు ఈకార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి యాచారం మండల మాజీ ఎం పీపీ రాచర్ల వెంకటేశ్వర్లు డీసీసీ ఉపాధ్యక్షులు ముత్యాల రాజశేఖర్ రావుఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ హరిత ప్రవీణ్ గౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోగు శేఖర్ నాయకులు ఉడుతల రవి గౌడ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు ఉక్కుల అశోక్‌కు రాష్ట్రస్థాయి పదవి దక్కడంపై ఆ యన మిత్రులు శ్రేయోభిలాషులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హర్షంవ్యక్తం చేస్తున్నారు ఆయన నా యకత్వంలో పార్టీ కార్యక్రమాలు మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్య క్తం చేశారు.

# ప్రజా సమస్య - కాలనీవాసుల ఆవేదన






**ఎల్బీనగర్ వెలుతురు జూన్ 14:**

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో నగరానికి అత్యంత సమీపంలో ఉన్న శ్రీ గాయత్రి నగర్ కాలనీ ఇప్పటికీ శివారు ప్రాంతంలా మౌలిక సదుపాయాల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ముఖ్యంగా కాలనీలో సీసీ రోడ్లు లేకపోవడంతో రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారి, కాలనీవాసులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు, వృద్ధులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు.కాలనీలో సుమారు 100 నుంచి 150 గృహాల్లో నివసిస్తున్న ప్రజలు సరైన మౌలిక వసతుల లేమితో దుర్భర జీవనం గడుపుతున్నారు. ఇప్పటికే గుంతలతో నిండిన రహదారులు రాబోయే వర్షాకాలంలో మరింత అధ్వాన్నంగా మారే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే రోడ్లు బురదమయంగా మారడంతో పాటు నీరు నిల్వ ఉండి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు.అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు కాలనీలోకి రావడం కూడా కష్టసాధ్యమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. చిన్నారులు పాఠశాలలకు వెళ్లడం, ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవడం కూడా రోజురోజుకూ కష్టతరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అందువల్ల సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాలనీలోని పరిస్థితిని పరిశీలించి, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ, వీధి దీపాలు వంటి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. రాబోయే వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేసి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు."ప్రజల మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ శ్రీ గాయత్రి నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని స్థానిక కాలనీవాసులు అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగింది."

# 'స్వచ్ఛ సేతు'తో పర్యావరణ ఉద్యమానికి కొత్త దిశ

- మోకిలా ఎథ్నిక్ రన్‌లో శూన్య వ్యర్థ జీవన విధానానికి పిలుపు
- ప్లాస్టిక్ రహిత నిర్వహణతో ఆదర్శంగా నిలిచిన ఎథ్నిక్ రన్
- సుస్థిర జీవన విధానం, వ్యర్థాల నిర్వహణ, ప్రకృతి పరిరక్షణపై ప్రముఖుల సందేశం

**శంకర్ పల్లి వెలుతురు జూన్ 14:**






గండిపేట్ వెల్ఫేర్ సొసైటీ (జీడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో మోకిలా ఎథ్నిక్ రన్ ఆదివారం ప్రొద్దుటూరు గ్రామంలోని ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవన విధానం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేష ఆదరణ పొందింది.ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నగర మాజీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, వాటా ఫౌండేషన్ ప్రతినిధి ఉదయ్ కుమార్, రామ్‌దేవ్, జె.ఎస్.ఆర్. అన్నమయ్య, బెంగళూరుకు చెందిన డాక్టర్ శాంతి తుమ్మల తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గండిపేట్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి వాణి తిమ్మయ్య మాట్లాడుతూ, ఎథ్నిక్ రన్ కేవలం ఆరోగ్యాన్ని ప్రోత్సహించే కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజలను తమ మూలాలు, సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలతో మళ్లీ అనుసంధానించే ఉద్యమమని తెలిపారు. అదే సమయంలో ప్రకృతి పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేసే వేదికగా ఈ కార్యక్రమం నిలిచిందన్నారు.కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా 'జీరో-వేస్ట్ రన్' నిలిచింది. ప్లాస్టిక్ నీటి బాటిళ్లు, భారీ ఫ్లెక్సీలు, మెడల్స్, బిబ్స్ వంటి వ్యర్థాలను సృష్టించే వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ హిత పద్ధతుల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కూడా శూన్య వ్యర్థాల లక్ష్యాన్ని సాధించడం గర్వకారణమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో 'స్వచ్ఛ సేతు' అనే జాతీయ వేదికను ప్రారంభించినట్లు వాణి తిమ్మయ్య వెల్లడించారు. ఈ వేదిక ద్వారా పౌరులు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ కార్యకర్తలు కలిసి పనిచేసి సుస్థిర అభివృద్ధికి బలమైన ఉద్యమాన్ని నిర్మించగలరని ఆమె తెలిపారు.సజ్జనార్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తాను సృష్టించే వ్యర్థాల పట్ల బాధ్యత వహించాలని, స్వచ్ఛ సేతు ఉద్యమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ శాంతి తుమ్మల మహిళలు మెన్‌స్ట్రువల్ కప్స్ వినియోగాన్ని ప్రోత్సహించాలని, అవసరానికి మించి దుస్తులు కొనుగోలు చేయకుండా వాటిని మరమ్మతులు చేసి మళ్లీ ఉపయోగించడం ద్వారా వ్యర్థాలను తగ్గించవచ్చని సూచించారు.రామ్‌దేవ్ మాట్లాడుతూ ప్రకృతిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని కాపాడడం ద్వారా భావితరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించవచ్చన్నారు. ఉదయ్ కుమార్ చెట్లను ప్రేమతో సంరక్షించాలని, చెట్లలో మేకులు కొట్టడం వంటి చర్యలను నివారించాలని సూచించారు.జె.ఎస్.ఆర్. అన్నమయ్య వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ, ఇంటి వద్దనే వ్యర్థాలను నాలుగు వర్గాలుగా వేరు చేయడం ద్వారా వాటి శాస్త్రీయ నిర్వహణ సాధ్యమవుతుందని వివరించారు.కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారందరూ సుస్థిర జీవన విధానం, బాధ్యతాయుతమైన వ్యర్థాల నిర్వహణ, ప్రకృతి పరిరక్షణ కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# చింతబావి బస్తీ దవాఖానను ఆకస్మిక తనిఖీ నిర్వహించిన డిఎంహెచ్ఓ

- బస్తీలోని పేద ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి
- డా: పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్ జిల్లా

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**






చింతబావి బస్తీ దవాఖానను ఆకస్మిక తనిఖీ నిర్వహించిన హైదరాబాద్ జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. పుట్ల శ్రీనివాస్ . ఆదివారం రోజున మెట్టుగూడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (UPHC) పరిధిలోని చింతబావి బస్తీ దవాఖానను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వివిధ రికార్డులు, ఔషధాల లభ్యత, అలాగే దవాఖానలోని పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు.తనిఖీ అనంతరం సిబ్బందికి సమయపాలన పాటించాలని, అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, దవాఖాన ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని డా. పుట్ల శ్రీనివాస్ గారు సిబ్బందికి ఆదేశించారు.ఆరోగ్య సేవలు మరింత మెరుగుపరిచి బస్తీ దవాఖాన పరిధిలోని పేద ప్రజలకు అన్ని రకాల ఆరోగ్య సేవలు , పరీక్షలు అందించాలని కోరారు. తనిఖీ సమయంలో బస్తీ దవఖాన వైద్యులు , సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి తో పాటు డా:శ్రీధర్ , జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్ట డివిజన్ RGK కాలనీలో నీటి సమస్యలు, చిరు వ్యాపారుల సమస్యలపై పాదయాత్ర

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 14:**



ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (RGK) కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యలను మరియు చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అతి త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ సెక్రటరీ గణేష్, డీసీసీ స్పోక్స్‌పర్సన్ భారత్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, కృష్ణ గౌడ్, రషీద్ , పిల్లి ఆంజనేయులు, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్, యువరాజ్, మహిళా నాయకురాలు కౌసల్య, చంద్రకళ, అనిత రెడ్డి, మాధవి రెడ్డి తదితరులు, కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ అవకాశాలు కనిపించాలి నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి

- డివైఎఫ్ఐ యాచారం మండల నూతన కమిటీ ఎన్నిక అధ్యక్ష కార్యదర్శులుగా కొండ్రు భాస్కర్, ఆల్లంపల్లి జంగయ్య

**యాచారం వెలుతురు జూన్ 14:**





యాచారం మండలం చింతపట్ల గ్రామంలోని బండి కంటి శేఖర్ నగర్ లో డివైఎఫ్ఐ మహాసభలు నిర్వహించారు ఈసందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ యువత సమాజ మార్పు కోసం కృషి చేయాలని డ్రగ్స్ గంజాయి మద్యానికి దూరంగా ఉండి సోదర భావంతోముం దుకు సాగాలని అన్నారు ఈసందర్భంగా డివైఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అ ధ్యక్షులుగా కొండ్రు భాస్కర్ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి జంగయ్య ఉపాధ్యక్షులు రమేష్ గణేష్ శ్రీ కాంత్ సహాయ కార్యదర్శిగా ఉపేందర్ సైదులు కమిటీ సభ్యులుగా జంగయ్య రాజుభూషణ్ అని ల్ అబ్బాస్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ జిల్లా ఉపా ధ్యక్షులు చందునాయక్ గిరి కాంత్ కాటంరాజు శేఖర్ కృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన

- తెలంగాణ రాష్ట్ర విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళి విద్యా కమిషన్ సభ్యులు

**మంచాల వెలుతురు జూన్ 14:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాలను తెలంగాణ రాష్ట్రవిద్య కమీ షన్ చైర్మన్ ఆకునూరి మురళి సభ్యులు వెంకట్ వివిధ శాఖల అధికారులు సందర్శించి పాఠశా లలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను పరిశీలించారుఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీఈవో వెంకటేశ్వర్ ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి మంచాల తహసిల్దార్ వెంకటప్రసాద్ రావు తె లం గాణ పబ్లిక్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సిద్ధగొని గిరిధర్ గౌడ్ తెలంగాణ ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ రాములు తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధానకా ర్యదర్శి పూజరి రమేశ పాఠశాల ఏఎస్ డీఎం సీ కమిటీ సభ్యులు నూకం రాజు ముదిరాజ్ లాలగారి జంగయ్య నుకం మల్లేష్ ముదిరాజ్ మా దపాకుల పార్వతి గ్రామపంచాయతీ పాలక మండలి సభ్యులు స్కూల్ టీ చర్లు వివిధ శాఖల అ ధికారులు మరియు తపస్ మంచాల మండల ప్రధాన కార్యదర్శి కావలి దత్తాత్రేయతదితరులు పాల్గొన్నారు.

# మంచాల మండలం వివిధ గ్రామాల్లో బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ

- యువకులు మద్యపానానికి డ్రగ్స్‌కు బానిసలు కావద్దు మంచి మార్గంలో నడవాలి
- ప్లాస్టిక్ వస్తువులను పూర్తి స్థాయిలో నిషేధిద్దాం
- బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి

**మంచాల వెలుతురు జూన్ 14:**



మంచాల మండలం బి అర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బండలేముర్ మంచాల జపాల రంగా పూర్ లోయపల్లి గ్రామాల్లో జూట్ బ్యాగులు పంపిణీ చేశారుఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి రెడ్డి మాట్లాడుతూ మంచాల మండలం ఉన్న గ్రామాల్లో ఉన్న అంగన్వాడి పాఠశాలలో కావలసిన వస్తువులు ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేస్తాం మహిళా సంఘాల కార్యాలయం వద్ద మరుగుదొడ్లు నిర్మాణం చేయిస్తాను అని అన్నారు ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని అన్నారు యువకులు మ ద్యపానానికి డ్రగ్స్ కు దూరంగా ఉండి మంచి చదువులు చదివి మంచి మార్గంలో నడవాలి గ్రా మానికి మంచి పేరు తేవాలి అని అన్నారు గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న నా దృ ష్టికి తీసుకువస్తే నావంతు సహకారం సేవలు చేస్తాను అని అన్నారు ఈకార్యక్రమంలో వివిధ గ్రా మాల సర్పంచులు ఫౌండేషన్ సభ్యులు పూన్నం రాము సద్దాం అశ్వాల బాలరాజు రావుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సాయి నగర్, ఆదిత్య గార్డెన్స్ కాలనీలలో నాలా, రోడ్లు, యూజీడీ సమస్యలపై ప్రజలతో ముఖాముఖి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 14:**



ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బాచుపల్లి పరిధిలోని సాయి నగర్, ఆదిత్య గార్డెన్స్ కాలనీలలో నెలకొన్న నాలా, రోడ్లు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (UGD) సమస్యలను పరిశీలించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి స్థానిక ప్రజలతో కలిసి కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, నాలాల నిర్వహణ లేకపోవడం, రోడ్లు దెబ్బతినడం, యూజీడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించారు. అనంతరం సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, కాలనీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని కొలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# రోహిణి నక్షత్రం సందర్భంగా ఘనంగా సుదర్శన హోమం

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 14:**



గోపాలపల్లి గ్రామంలోని శ్రీ పార్వతి రామ లింగేశ్వర స్వామి ఆలయంలో రోహిణి నక్షత్రం సందర్భంగా ఆదివారం నిర్వహించిన సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్ రెడ్డి – రాజేశ్వరి దేవి దంపతులు, కార్యనిర్వహణ అధికారి చిట్టెడి వెంకటరెడ్డి పాల్గొన్నారు. అలాగే భక్తులు దేవేందర్ గౌడ్ – సుజాత, మార్క నారాయణ – నాగమణి, తీగల యాదగిరిరావు – చంద్రకళ, రేగట్టే రాంగోపాల్ రెడ్డి – వరలక్ష్మి, జెల్ల కృష్ణయ్య, ఆంజనేయులు – పద్మ, గోపాల్ రెడ్డి – సునీత, శివకుమార్ – యోగేశ్వరి, పద్మ రాజశేఖర్ రెడ్డి, మధుసూదన్ – లక్ష్మి, చంద్రశేఖర్ – లక్ష్మి, శ్రీనివాస్ – పద్మ, శివమణి, రామకృష్ణారెడ్డి – మానస, నరసింహ – సత్తమ్మ, వెంకటేశ్వర్లు – స్రవంతి దంపతులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితులు శాస్త్రోక్తంగా సుదర్శన హోమాన్ని నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# తెలంగాణ మజ్దూర్ యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 14:**



నార్కట్‌పల్లి డిపోలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ నూతన కమిటీని నల్గొండ రీజియన్ సెక్రటరీ గోపనబోయిన శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు మీలా ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించి, నూతన కమిటీ సభ్యులను డిపో మేనేజర్‌కు పరిచయం చేశారు. అనంతరం నూతన కమిటీ బాధ్యతలను స్వీకరించిన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.నూతన కమిటీలో గౌరవ అధ్యక్షులుగా ఎం.ఎస్. రెడ్డి, అధ్యక్షులుగా బడే బోగేష్, ప్రధాన కార్యదర్శిగా చిలకల నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధనబోయిన సుజాత, గ్యారేజ్ సెక్రటరీగా ఎండి మొయినుద్దీన్ ఎన్నికయ్యారు.అసిస్టెంట్ సెక్రటరీలుగా మేడబోయిన మల్లికార్జున్, నడింపల్లి మల్లేష్ యాదవ్, కె. మంజుల, ఉపాధ్యక్షులుగా కె.ఎన్. రెడ్డి, ఏ. అనంతలక్ష్మి, డి. లింగయ్య, దుర్గ, సీహెచ్. బుచ్చయ్య, ట్రెజరర్‌గా కొప్పు యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఏ.ఆర్. రెడ్డి, ఎం. నరసింహ, బి. యాదగిరి, వరలక్ష్మి, శ్రీవాణి, శకుంతల ఎన్నికయ్యారు.చీఫ్ అడ్వైజర్లుగా ఆర్. ఎల్లయ్య, ఎండి రసూల్, జె. యాదయ్య, డెలిగేట్లుగా మేడంపెల్లి వెంకన్న, కార్తీక్, వెంకటనర్సు ఎన్నికయ్యారు.ఈ పరిచయ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు, కమిటీ సభ్యులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

# తొమ్మిదేళ్ల చిన్నారి ఐదు గంటల పాటుగా హులా హూప్

**నల్లగొండ టౌన్ వెలుతురు జూన్ 14:**



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన జెల్లా శ్రేష్ట ప్రగ్య హులా హూప్ క్రీడను 5 గంటల 3 నిముషాలు చేసి అందరిని ఆశ్చర్య పరిచింది. హైదరాబాద్ ఎల్ బీ నగర్ లో తను చదువుతున్న జీడి గోనేంక్ పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో తన ప్రతిభను కనపరిచారు. ఈ క్రీడా ప్రదర్శన జూన్ 11, 2026న బుక్ ఆఫ్ ఇండియన్ రికార్డ్స్ న్యాయ నిర్ణేతల ముందు విద్యార్థిని తన అత్యుత్తమ ప్రదర్శన చేశారు.గతంలో ఉన్న భారత రికార్డు 4గంటలు 33 నిముషాలు కాగా శ్రేష్ట ప్రగ్య ఆ రికార్డును అధిగమించి నూతన మైలురాయిని దాటింది. అంతేగాకుండా స్కేటింగ్లో కూడ ప్రథమ స్థానం సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. ఆమె సాధించిన ఈ ఘనత చిన్న వయసులోనే అసాధారణ పట్టుదల, అంకిభావానికి నిదర్శనంగా మారిందని చెప్పొచ్చు. విద్యార్థిని ఈ ఘనత సాధించడానికి తల్లిదండ్రులు జెల్ల నాగరాజు, శాలిని ప్రోత్సహం ఎంతో అందిస్తున్నారని శ్రేష్ట ప్రగ్య తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 14:**



నకిరేకల్ శాసనసభ్యులు, తెలంగాణ ప్రభుత్వ విప్ వేముల వీరేశం సహకారంతో ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను శనివారం పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ ఎల్లెందుల లింగస్వామి, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్ రెడ్డి సమక్షంలో చిక్కుల పాపులు, మేడి బాలకృష్ణ, సార మల్లయ్యలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వం సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం కృషితో నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు చేరుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మూడవ వార్డు సభ్యులు చిక్కుల పద్మ–శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డే శ్రీనివాసరెడ్డి, చిక్కుల చందు, ఇంద్రకంటి నాగయ్య, ఇంద్రకంటి రాజు, చిక్కుల మహేష్, చిక్కుల సతీష్, అరూరి అనిల్, కొషిక మల్లేష్, అంతటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ అందుకున్న డా. నామా సోమేశ్వర్

**నల్లగొండ వెలుతురు జూన్ 14:**



తిప్పర్తి మండలం కేశరాజుపల్లి గ్రామానికి చెందిన నామా సోమేశ్వర్ కు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ప్రస్తుతం హైదారాబాద్ సమీపంలోని కందిలో ఉన్న ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ( ఐఐటి) లో టెక్నికల్ సూపరిం డెంటుగా విధులు కొనసాగిస్తున్నారు. విధ్య పట్ల తనకున్న అంకిత భావంతోనే ఈ అవార్డులు సాధించినట్లు తెలిపారు. నకు అవార్డు రావడానికి సహకరించిన ప్రోత్సహించిన అన్న, వదిన, ఆచార్యులు, బంధువులు , స్నేహితులు, కుటుంబ సభ్యులు సహచరులందరికి దన్యవాదాలు తెలిపారు. డా. నామా సోమేశ్వర్ రావు భవిష్యత్లో మరన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రపంచ విప్లవయోధుడు చేగువేరా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన జనసేన పార్టీ

**చౌటుప్పల్, వెలుతురు 14 జూన్ 2026:**






ప్రపంచ విప్లవయోధుడు చేగువేరా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన జనసేన పార్టీ

1) పైలాన్ పార్కులో చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు ఆముదాల పరమేశ్.

2) తంగేడు వనంలో చెత్తబుట్టల పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు ఆముదాల పరమేశ్

3) ప్రపంచ విప్లవయోధుడు చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు ఆముదాల పరమేశ్, జన సైనికులు

ప్రపంచ విప్లవయోధుడు ఎర్నెస్టో చేగువేరా జయంతి సందర్భంగా జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేశ్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

"ప్రతి అడుగు స్వచ్ఛత వైపు.. ప్రతి గడప పరిశుభ్రత వైపు.. నవ నిర్మాణమే జనసేన లక్ష్యం – చౌటుప్పల్‌ను స్వచ్ఛంగా మారుద్దాం!" అని పిలుపునిస్తూ పైలాన్ పార్క్ మరియు తంగేడు వనంలో చెత్తబుట్టలను పంపిణీ చేశారు. అలాగే చేగువేరా జీవితం, ఆయన విప్లవ భావజాలం, సామాజిక సేవా స్ఫూర్తిని తెలియజేసే పుస్తకాలను యువతకు, ప్రజలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేశ్ మాట్లాడుతూ, "దేశం, జాతి, మతం అనే సరిహద్దులను దాటి మానవత్వం కోసం పోరాడిన మహనీయుడు చేగువేరా. ప్రపంచ యువతలో సామాజిక చైతన్యం, పోరాట స్ఫూర్తి, సేవాభావాన్ని నింపిన గొప్ప విప్లవ యోధుడు. 'ప్రజల కోసం జీవించడం, అవసరమైతే ప్రజల కోసమే ప్రాణత్యాగం చేయడం' అనే సందేశాన్ని తన జీవితంతో చూపించిన మహోన్నత వ్యక్తి. సమాజం కోసం, దేశం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రతి జనసైనికుడు చేగువేరాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి" చేగువేరా సిద్ధాంతాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, సమాజంలో మార్పు తీసుకురావాలనే తపన ప్రతి యువకుడిలో ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చెత్తబుట్టల పంపిణీ కార్యక్రమం ద్వారా స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆముదాల పరమేశ్,బొల్లం మల్లేశ్, చిన్నం ప్రశాంత్,బద్రి రాజు, చిన్నం రాజీవ్ , పెద్దగొని లింగస్వామి,సరికొండ సంజయ్,పాశం శ్రీనాథ్,శ్రీకాంత్, ముద్దం రాజు,గణేష్, దొడ్డి వంశీ, బాలగోని శివ జన సైనికులు పాల్గొన్నారు.

# ఆత్మీయ అభినందన

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు జూన్ 14:**

జనగామ వాస్తవ్యులు అందోజు శ్రీనివాస్ కు జేఎన్‌టీయూ నుండి పీహెచ్‌డీ ప్రదానం చేసిన సందర్భంగా ఆత్మీయ మిత్రులు చుక్క గిరి మరియు హెచ్చు. శ్రీకాంత్ ఆదివారం రోజు అభినందనలు తెలియ జేశాము.ప్రొఫెసర్ సునీత యాదవ్ పర్యవే క్షణలో ఆయన "ఫిల్మ్స్ ఆన్ సోషల్ రియలిజం: ఎ క్రిటికల్ స్టడీ ఆఫ్ అడాప్టేషన్స్ ఆఫ్ పాపులర్ ఇండియన్ ఫిక్షన్ ఇన్ ఇంగ్లీష్" (Films on Social Realism: A Critical Study of Adaptations of Popular Indian Fiction in English) అనే అంశంపై పరిశోధన నిర్వహించారు.చలనచిత్ర అధ్యయన (ఫిల్మ్ స్టడీస్) రంగంలో శ్రీనివాస్ చేసిన ఈ పరిశోధన సాహిత్యాన్ని, సినిమాను అద్భుతంగా అనుసంధా నించింది. ఆంగ్లంలో వెలువడిన ప్రముఖ భారతీయ నవలల ఆధారంగా, సామాజిక యథార్థవాదాన్ని ప్రతిబింబిస్తూ తెరకెక్కిన చిత్రాలపై ఆయన సమగ్ర విశ్లేషణ చేశారు. వాణిజ్యపరంగా ఘనవిజయం సాధించడంతో పాటు, విమర్శకుల ప్రశంసలు అందుకున్న నవలా ఆధారిత చలనచిత్రాలను ఈ సిద్ధాంత వ్యాసంలో ప్రధానంగా చర్చించారు.భారతదేశంలో సామాజిక స్పృహ, సాంస్కృతిక విలువలతో కూడిన చలనచిత్రాల నిర్మాణం మరింతగా జరగాల్సిన ఆవశ్యకతను ఈ పరిశోధన నొక్కి చెప్పింది. మన దేశం స్థానిక చరిత్రలు, జానపద కళలు, పౌరాణిక గాథలకు నిలయమని, ఇటువంటి కథాంశాలతో మరిన్ని వాస్తవిక చిత్రాలను రూపొందించేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని సిద్ధాంత వ్యాసం ద్వారా స్పష్టం చేశారు.



# భగవద్గీత జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలి

- గోవింద దాస్ ప్రభూజీ

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 14:**



నార్కట్‌పల్లిలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో నిర్వహించిన భగవద్గీత ప్రచార కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రజ్ఞాపురం శ్రవణ్ కుమార్ – లీలావతి దంపతులు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, భగవద్గీత జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఆస్వాదించి తమ జీవితాలను సన్మార్గంలో నడిపించుకోవాలని సూచించారు. అలాగే భగవద్గీతలోని గొప్ప సందేశాలను మరో ముగ్గురికి తెలియజేస్తూ హిందూ ధర్మం, సనాతన ధర్మం వ్యాప్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్‌కు చెందిన గోవింద దాస్ ప్రభుజీ, వేణుగోపాల స్వామి దేవాలయ చైర్మన్ దోసపాటి ప్రసాద్, అమ్మల కోవెల దేవాలయ చైర్మన్ దేవరశెట్టి నారాయణ, రామ్ కరసేవకులు డాక్టర్ పాల్వాయి భాస్కరరావు, చెరువుగట్టు ధర్మకర్త సంపత్, మాజీ ఎంపీటీసీ రాధారపు బిక్షపతి – విజయలక్ష్మి దంపతులు, బీజేపీ మండల అధ్యక్షుడు మేడమైన శ్రీనివాస్ యాదవ్, నార్కట్‌పల్లి గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రామలింగం, బీజేపీ నాయకులు పాలకూరి రమేష్, పసునూరి సంపత్, దేవాలయ ధర్మకర్తలు ఐతరాజు రమేష్, అర్చకులు, పట్టణ ప్రముఖులు డాక్టర్ ప్రసాద్, మునుకుంట్ల గణేష్, సామ కొండల్ రెడ్డి, గంధం భాస్కర్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై భగవద్గీత విశిష్టతను తెలుసుకున్నారు.

# మల్లయ్య మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయన్న

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 14:**

నార్కట్‌పల్లి బజారు హమాలీ కార్మికుడు దేశపాక మల్లయ్య మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయన్న అన్నారు.ఎన్నారం గ్రామానికి చెందిన దేశపాక మల్లయ్య గత ఐదేళ్లుగా నార్కట్‌పల్లి బజారు హమాలీ వర్కర్‌గా పనిచేస్తున్నారు. రోజువారీ పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.మల్లయ్య మృతికి సంతాపంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి బస్ స్టాండ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతపల్లి బయన్న మాట్లాడుతూ, మల్లయ్య మూట మేస్త్రిగా పనిచేస్తూనే కార్మికుల హక్కుల కోసం జరిగే ఉద్యమాలు, పోరాటాల్లో చురుకుగా పాల్గొనేవారని గుర్తు చేశారు. ఆయన మరణం కార్మిక ఉద్యమానికి, హమాలీ కార్మికులకు తీరని లోటని పేర్కొన్నారు.అనంతరం కార్మికులు మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆమనగంటి ఐలయ్య, హమాలీ కార్మికులు మంద గోపాలు, లింగాల వీరయ్య, పాల రమేష్, బందెల లింగస్వామి, శంకరయ్య, ఎల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# ఫ్లయింగ్ స్టార్ ఏవియేషన్ అండ్ హాస్పిటాలిటీ అకాడమీ ఘనంగా స్నాతకోత్సవం

**లకిడికపూల్ జూన్ 14 ( వెలుతురు ):**







ఎంత గొప్పగా ఎదిగినా.. మూలాలను మరిచిపోవద్దు' అని త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డా.టి. అమర్ నాథ్ గౌడ్ యువతను కోరారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఫ్లయింగ్ స్టార్ ఏవియేషన్ అండ్ హాస్పిటాలిటీ అకాడమీ స్నాతకోత్సవం, ప్లేస్మెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ అమర్ నాథ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇప్పుడు మీరు ఉన్నత శిఖరాలకు ఎగిరే స్థితిలో ఉన్నారన్నారు. కానీ మీ వెనక ఉండిపోయిన వారిని మర్చిపోవద్దని...ఒక సింహంలా ఉండాలని.. అది ఏలాగైతే తన కుటుంబాన్ని, అప్తులను కాపాడుకుంటుందో.. అలాంటి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. ఈరోజుల్లో మహిళలదే హవా నడుస్తోందని... ఇండిగోలో 'గర్ల్ పవర్' అనే నినాదం విన్నప్పుడు చాలా సంతోషం అనిపించిందన్నారు. మీరంతా కష్టపడినప్పుడు, మిమ్మల్ని మీరు నిరూపించుకుంటేనే కచ్చితంగా వృత్తిలో, సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని అన్నారు. తల్లిదండ్రుల్ని, కుటుంబం, స్నేహితులు, ఆత్మీయులను మరిచిపోవద్దు.. వారి నమ్మకాన్ని వమ్ము చేయవద్దు అని పేర్కొన్నారు. ముందుగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకాడమీ సీఓఓ బింగి శివసాయిగౌడ్, అకాశ్ ఏయిర్ కెప్టెన్ ఉదిత్ పన్వార్, ఏయిర్ లింక్ ఫ్లైట్ స్కూల్ అధ్యక్షుడు పృథ్వీ కుర్రా తదితరులున్నారు.

# 12 వ డివిజన్ మానేరు డ్యామ్ సమీపంలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు జూన్ 14:**

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ మానేరు డ్యామ్ సమీపంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి సహకారంతో, సీఎస్ఆర్ మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేయడానికి ఈ జిమ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.నగర అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడంలో నగర పాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారికి, సీఎస్ఆర్ మలయప్ప ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు గారు, మానేరు వాకర్స్ సభ్యులు, నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి - ఆపదలో ఉన్న కుటుంబాలకు అండ

## 13 మంది లబ్ధిదారులకు రూ. 6,64,500/- విలువ గల చెక్కులు పంపిణీ చేసిన కాట శ్రీనివాస్ గౌడ్

**పటాన్‌చెరు వెలుతురు జూన్ 14:**



పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందుల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ఎంతో అండగా నిలుస్తోందని పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఆదివారం ఆయన నివాసంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 6,64,500/– విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ "ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అనారోగ్యం, ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి గొప్ప భరోసాను కల్పిస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నాం. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అందుబాటులో ఉంటాను" అని పేర్కొన్నారు.

# ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- రక్తదాతలు ప్రాణదాతలు – నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 14:**



ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ పాల్గొని రక్తదాతలను అభినందించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రక్తదానం మహోన్నతమైన సేవ అని, రక్తదాతలు నిజమైన ప్రాణదాతలని కొనియాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తదానం చేయడానికి అర్హుడని, ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు, అనారోగ్య సమస్యల సమయంలో రక్తం అందక అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉందని పేర్కొన్నారు.గత 20 సంవత్సరాలుగా 41 సార్లు స్వయంగా రక్తదానం చేస్తూ సమాజంలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఇతరులను ప్రోత్సహిస్తున్న డాక్టర్ ఆర్. గోపి కృష్ణను ఈ సందర్భంగా మేయర్ ప్రత్యేకంగా అభినందించారు.సమాజ సేవలో భాగంగా రక్తదాన శిబిరాల నిర్వహణ ద్వారా ఆసరా ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని మేయర్ అన్నారు. యువత ఎక్కువ సంఖ్యలో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని మానవతా దృక్పథాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల కిరణ్, చాడ ఆనంద్, అభిషేక్, రాజు, నాగరాజు, చిరంజీవి, కిరణ్, ఆసరా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, సభ్యులు ఎం. రవిచందర్, ఎస్. నిఖిల్, అద్వైత్ తదితరులు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# శంకరపట్నంలో వైభవంగా చిరుతల రామాయణం



**కరీంనగర్ వెలుతురు జూన్ 14:**

శంకరపట్నం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో గత నాలుగు రోజులుగా భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న 'చిరుతల రామాయణ' ప్రదర్శనలు నేటితో ముగిశాయి. ఈ కార్యక్రమ ముగింపు సందర్భంగా ఆదివారం రోజున శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని అత్యంత కన్నులపండువగా నిర్వహించారు.పురాతన కళకు ప్రాణం పోస్తూ..లింగాపూర్ గ్రామానికి చెందిన స్థానిక కళాకారులు రామాయణంలోని వివిధ ఘట్టాలలో తమ అద్భుత నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ప్రతి ఒక్క కళాకారుడు తమతమ పాత్రల్లో లీనమై, జీవం పోస్తూ ప్రదర్శన ఇవ్వడం విశేషం. మరుగున పడిపోతున్న పురాతన, జానపద కళలను బతికించుకునేందుకు లింగాపూర్ గ్రామ కళాకారులు చేస్తున్న ఈ ప్రయత్నాన్ని పలువురు గ్రామస్తులు, భక్తులు ఎంతగానో అభినందించారు.ఈ అద్భుత ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమం ప్రముఖ గురువులు, మహారాజశ్రీ అలివేలు సమ్మిరెడ్డి గ పర్యవేక్షణలో, ఆద్వర్యంలో అత్యంత క్రమశిక్షణతో నిర్వహించబడింది. అలాగే, ఈ కార్యక్రమ విజయవంతానికి ★కోడూరు తిరుపతి ప్రత్యేక పర్యవేక్షకులుగా వ్యవహరించారు.ఈ ప్రదర్శనలో కేవలం లింగాపూర్ గ్రామ కళాకారులే కాకుండా, పరిసర వివిధ గ్రామాల నుండి వచ్చిన ఉత్తమ కళాకారులు కూడా పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని తరించి, కళాకారులను ఘనంగా సత్కరించారు.

# రామకృష్ణ కాలనీ, మల్లాపూర్‌లలో ఘనంగా "స్వచ్ఛ పాఠశాల"

**తిమ్మాపూర్ వెలుతురు జూన్ 14:**



తిమ్మాపూర్ మండలంలో మల్లాపూర్ , రామకృష్ణ కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివారం రోజున స్థానిక బిజెపి శ్రేణులు "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని ఘనంగా ,విజయవంతంగా నిర్వహించారు. . ఈకార్యక్రమానికి బీజేపీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగాహాజరయ్యారు.పాఠశాల ఆవరణలను శుభ్రం చేసే ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని, స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రామకృష్ణ కాలనీ , మల్లాపూర్ పాఠశాలలలోని చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను సుందరంగా స్థానిక బిజెపి శ్రేణులు శ్రమదానం చేయడం జరిగిందని తెలిపారు. ఇల్లుతో సమానంగా పాఠశాలను పరిశుభ్రంగా ఉన్నప్పుడే పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంఏర్పడుతుందన్నారు.విద్యార్థులకు చిన్నతనం నుంచే పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వల్ల వారు ఆరోగ్యకరమైన పౌరులుగా ఎదుగుతారని, విద్యాసంస్థల్లో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, ప్రజలు , ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ఇందులో భాగస్వామ్యం కావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# నేటి నుంచే బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ప్రారంభం

- **ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి శ్రీకారం***
- **ప్రభుత్వ విద్యాసంస్థల్లో అల్పాహార పథకం అమలు**
- **తొలి విడతలో 1,302 విద్యాసంస్థల్లో ప్రారంభం**
- **1.44 లక్షల మంది విద్యార్థులకు నేరుగా లబ్ధి**
- **ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు 22 లక్షల మందికి విస్తరణ లక్ష్యం**
- **వారానికి ఆరు రోజులపాటు వేడి వేడి అల్పాహారం**
- **పాలు, రాగిజావతో పోషకాహారానికి పెద్దపీట**
- **పాఠశాలలతో పాటు జూనియర్ కాలేజీల్లోనూ అమలు**
- **రూ.720 కోట్ల భారీ వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం**
- **39 కేంద్రీకృత వంటశాలల నిర్మాణానికి కార్యాచరణ**
- **ఆకలి నుంచి విద్యార్థులకు విముక్తి.. నాణ్యమైన విద్యకు బాటలు**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**

ఉదయం ఆకలితో పాఠశాలకు వెళ్లే పిల్లల దృశ్యం ఇక గతం కానుంది. తరగతి గదిలో పుస్తకం తెరిచినా కడుపు నిండకపోతే చదువు మీద ఏకాగ్రత నిలవదన్న వాస్తవాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం మరో కీలక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు ఇకపై ఉదయం వేడి వేడి అల్పాహారం అందించనుంది. విద్య, ఆరోగ్యం, పోషకాహారం అనే మూడు ప్రధాన లక్ష్యాలను ఒకేసారి చేరుకునేలా రూపొందించిన ఈ బ్రేక్‌ఫాస్ట్ పథకం నేటి నుంచి అమల్లోకి రానుంది.

### ఆకలి లేని ఉదయం.. ఆత్మవిశ్వాసంతో తరగతి గది

పల్లె ప్రాంతాల్లోనూ, పట్టణ పేద కుటుంబాల్లోనూ చాలామంది పిల్లలు ఉదయం తగిన ఆహారం తీసుకోకుండానే పాఠశాలకు వెళ్తుంటారు. దీనివల్ల శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలకు వచ్చిన వెంటనే పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 1,269 పాఠశాలలు, 33 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. మొత్తం 1,44,610 మంది విద్యార్థులు ప్రారంభ దశలో లబ్ధి పొందనున్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల మందికి లబ్ధి

ప్రస్తుతం ప్రారంభమవుతున్నది కేవలం తొలి అడుగు మాత్రమే. రానున్న నెలల్లో తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఈ పథకాన్ని విస్తరించనున్నారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న సుమారు 22 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం అందుబాటులోకి రానుంది. దీంతో దేశంలో విద్యార్థుల పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందనుంది.

### వారానికి ఆరు రోజులు రుచికరమైన మెనూ

విద్యార్థులకు కేవలం కడుపు నింపే ఆహారం కాదు.. పోషక విలువలతో కూడిన రుచికరమైన అల్పాహారం అందించేందుకు ప్రత్యేక మెనూను రూపొందించారు.

**సోమవారం – దోసె, సాంబారు లేదా చట్నీ**

మంగళవారం – మిల్లెట్ ఇడ్లీ, సాంబారు
బుధవారం – పూరీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కుర్మా
గురువారం – బోండా, సాంబారు లేదా చట్నీ
శుక్రవారం – ఇడ్లీ, సాంబారు లేదా చట్నీ
శనివారం – ఉప్మా, సాంబారు లేదా చట్నీ

విద్యార్థుల వయసును బట్టి పరిమాణాలు కూడా నిర్ణయించారు. చిన్నారులకు 150 గ్రాములు, పెద్ద తరగతుల విద్యార్థులకు 200 గ్రాముల వరకు ఉప్మా అందించనున్నారు.

### పాలు.. రాగిజావ.. పోషకాహారానికి ప్రాధాన్యం

అల్పాహారంతో పాటు పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారానికి మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందించనున్నారు. ప్రీ ప్రైమరీ నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులకు 75 మిల్లీలీటర్లు, పై తరగతుల వారికి 100 మిల్లీలీటర్ల చొప్పున అందజేస్తారు. కాల్షియం, ప్రోటీన్లు, ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా అందేలా మెనూ రూపొందించారు.

### రూ.720 కోట్ల భారీ ప్రణాళిక

ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. మొత్తం రూ.720 కోట్ల వ్యయంతో కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఇందులో పాల సరఫరాకు రూ.180 కోట్లు, అల్పాహారానికి రూ.540 కోట్లు ఖర్చు చేయనున్నారు. అదనంగా ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూ.56 కోట్లు కేటాయించారు.

### ఆధునిక కిచెన్ల నుంచి నేరుగా పాఠశాలలకు

ఆహార నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ కేంద్రీకృత వంటశాలల ద్వారా అల్పాహారాన్ని సిద్ధం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 39 ప్రాంతాల్లో ఆధునిక కిచెన్ల నిర్మాణానికి రూ.299.90 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఉన్న ఏడు కిచెన్లను ఆధునికీకరించనుండగా, మిగిలిన వాటిని కొత్తగా నిర్మించనున్నారు. ఈ నిర్మాణ బాధ్యతలను తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక అభివృద్ధి సంస్థ పర్యవేక్షించనుంది.



### ప్రభుత్వంతో చేతులు కలిపిన స్వచ్ఛంద సంస్థలు

ఈ కార్యక్రమంలో ప్రభుత్వంతో పాటు ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం అవుతున్నాయి. మొత్తం వ్యయంలో 70 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుండగా, మిగిలిన 30 శాతం వ్యయాన్ని స్వచ్ఛంద సంస్థలు భరించనున్నాయి.మేడ్చల్–మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల్లో మన్నా ట్రస్ట్ ద్వారా 107 పాఠశాలలు, 12 జూనియర్ కాలేజీల విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. మరోవైపు హరే కృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 1,162 పాఠశాలలు, 21 జూనియర్ కాలేజీల విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.

### జూనియర్ కాలేజీలకూ మధ్యాహ్న భోజనం

ఇప్పటివరకు పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు కూడా విస్తరించనున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా ఉన్నత విద్యలో డ్రాపౌట్లు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుమారు 1.70 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

### ఆకలి నుంచి అభ్యాసం వరకు..

విద్యార్థి జీవితంలో ఆకలి పెద్ద అడ్డంకి. ఆ అడ్డంకిని తొలగిస్తేనే విద్యార్థి ప్రతిభ వెలుగులోకి వస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభిస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం కేవలం అల్పాహారం అందించే కార్యక్రమం మాత్రమే కాదు. ఇది పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించే ప్రయత్నం. ఇది విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సంకల్పం. ఇది పాఠశాల హాజరు శాతాన్ని పెంచే వ్యూహం.

ముఖ్యంగా ఆకలి నుంచి అభ్యాసం వైపు పిల్లలను నడిపించే సామాజిక పెట్టుబడి.రేపటి నుంచి పాఠశాల ప్రాంగణాల్లో వినిపించబోయే గంట శబ్దంతో పాటు వేడి వేడి అల్పాహారం సువాసనలు కూడా విద్యార్థులను ఆహ్వానించబోతున్నాయి. తెలంగాణ విద్యా రంగంలో ఇది మరో కీలక మైలురాయిగా నిలవనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నోయిడా కార్మికుల సమ్మె కేసులు... న్యాయ వ్యవస్థ ద్వంద్వ వైఖరిపై నిరసన

**హైదరాబాద్ , వెలుతురు జూన్ 14:**

నోయిడా కార్మికుల సమ్మెకు మద్దతుగా నిలిచిన కార్యకర్తలు, జర్నలిస్టులు, విద్యార్థులపై నమోదైన కేసులను ఖండిస్తూ ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. 'పీపుల్ ఎగైనెస్ట్ స్టేట్ రిప్రెషన్' ఫోరం, 'ది క్యాంపెయిన్ ఫర్ రిలీజ్ ఆఫ్ వర్కర్స్ అండ్ యాక్టివిస్ట్స్ ఆఫ్ నోయిడా' ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, హింసను ప్రేరేపించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారి డ్రైవర్ అనిల్ కుమార్‌కు బెయిల్ మంజూరు చేస్తూ, కార్మికుల హక్కుల కోసం ఉద్యమించిన కార్యకర్తలు, మేధావులు, విద్యార్థులు, కళాకారులను మాత్రం అక్రమ కేసులతో నిర్బంధించడం న్యాయ వ్యవస్థ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని విమర్శించారు. తగిన ఆధారాలు లేకపోయినా వారిని జైలులో ఉంచడం అన్యాయమని పేర్కొన్నారు. ఏప్రిల్ 11న కనీస వేతనాలు, ఎనిమిది గంటల పని దినం వంటి హక్కుల కోసం కార్మికులు చేపట్టిన శాంతియుత సమ్మెకు పలువురు కార్యకర్తలు మద్దతు తెలిపారు. సమ్మె అనంతరం యాక్టివిస్టులు రూపేష్ రాయ్, ఆకృతి చౌదరి, కళాకారిణి సృష్టి, కార్మికురాలు మనీషాలను మెట్రో స్టేషన్ వద్ద పోలీసులు అరెస్టు చేశారని ఆరోపించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు సత్యం వర్మ, సామాజిక కార్యకర్త ఆదిత్య ఆనంద్, విద్యార్థి యాక్టివిస్టులు హిమాంశు ఠాకూర్, యోగేష్ మీనాలను కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్టయిన వారిపై బలమైన ఆధారాలు లేకపోవడంతో ప్రభుత్వం కొత్త కేసులు నమోదు చేసి విడుదలను అడ్డుకుంటోందని నిరసనకారులు ఆరోపించారు. రూపేష్ రాయ్‌పై 10, ఆదిత్య ఆనంద్‌పై 9, సత్యం వర్మ, ఆకృతి చౌదరి, సృష్టి గుప్తా, మనీషా చౌహాన్, హిమాంశు ఠాకూర్‌లపై తలా 8, యోగేష్ మీనాపై 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఐదేళ్ల విడాకుల పోరాటానికి సుఖాంతం.. కోర్టులోనే కలిసిపోయిన దంపతులు



- విడాకుల కోసం ఐదేళ్లుగా కోర్టు చుట్టూ తిరిగిన జంట
- కోర్టు తీర్పు దశలో మారిన మనసులు
- భార్య తండ్రికి సాయం చేసిన భర్త
- అనారోగ్య సమయంలో అండగా నిలిచిన సౌరభ్
- ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు ఖర్చులు భరించిన భర్త
- భర్త మనసు తెలుసుకుని కదిలిపోయిన శిఖ
- విచారణ సందర్భంగా కీలక మలుపు
- విడాకుల పత్రాలు చించేసిన భార్య
- న్యాయమూర్తి ఎదుటే కౌగిలించుకున్న దంపతులు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఘటన

**ఢిల్లీ వెలుతురు జూన్ 14:**

విడాకుల కోసం ఐదేళ్లుగా పోరాడిన ఓ దంపతులు చివరి క్షణంలో ఒకరినొకరు అర్థం చేసుకుని మళ్లీ కలిసిపోయిన ఘటన ఢిల్లీలో చోటుచేసుకుంది. కోర్టులో న్యాయమూర్తి ఎదుటే భార్యాభర్తలు కౌగిలించుకుని కన్నీళ్లు పెట్టుకోవడంతో ఈ కథకు సుఖాంతం లభించింది. ప్రస్తుతం ఈ ఘటన సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమైంది.సమాచారం ప్రకారం, ఢిల్లీకి చెందిన సౌరభ్ అనే యువకుడు 2020లో శిఖ అనే యువతిని వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లైన కొద్ది రోజులకే ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. కుటుంబ కలహాలు పెరగడంతో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్న ఈ జంట గత ఐదేళ్లుగా ఫ్యామిలీ కోర్టులో కేసు నడుపుతోంది.ఈ వివాదం కారణంగా శిఖ కుటుంబం తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. ఇటీవల శిఖ తండ్రికి గుండెపోటు రావడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. కోర్టు ఖర్చులకే కుటుంబం వద్ద ఉన్న డబ్బంతా ఖర్చైపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించలేక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.ఈ విషయం తెలుసుకున్న సౌరభ్ తన మాజీ భార్య కుటుంబానికి అండగా నిలిచాడు. శిఖ తండ్రిని గురుగ్రామ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స కోసం అవసరమైన ఖర్చులను భరించాడు. మెరుగైన వైద్యం అందడంతో శిఖ తండ్రి కోలుకున్నారు. సౌరభ్ చేసిన ఈ సహాయం శిఖ మనసును కదిలించింది.ఇటీవల విడాకుల కేసు విచారణ కోసం ఇద్దరూ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి "మీరు ఇప్పటికీ విడాకులు తీసుకోవాలనుకుంటున్నారా?" అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నతో భావోద్వేగానికి గురైన శిఖ తన వద్ద ఉన్న విడాకుల పత్రాలను చించేసి సౌరభ్‌ను హత్తుకుని కన్నీళ్లు పెట్టుకుంది.తాము ఇక విడిపోవాలనుకోవడం లేదని, కలిసి జీవితం కొనసాగించాలని నిర్ణయించుకున్నామని ఇద్దరూ న్యాయమూర్తికి తెలిపారు. దీంతో ఐదేళ్లుగా కొనసాగుతున్న వివాదానికి ముగింపు పలుకుతూ ఈ దంపతులు కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ముందడుగు వేశారు.సినిమా కథను తలపించే ఈ ఘటన ప్రేమ, అవగాహన, క్షమాభావం ఉంటే ఎలాంటి విభేదాలనైనా అధిగమించవచ్చని మరోసారి నిరూపించిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ఈ దంపతుల కథ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

# "ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అలవాటుగా మార్చుకున్న వ్యక్తి సమ్మన్న: సర్పంచ్ సునీత కుమార్



- కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి అండగా నిలిచిన సమ్మిగౌడ్ చిలువేరు
- ఉప్పరపల్లి గ్రామంలో సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం వితరణ

**కేసముద్రం వెలుతురు జూన్ 14:**

కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తిని కోల్పోవడంతో భార్య అమల, కుమార్తె ప్రియ, తల్లి ఉప్పమ్మలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సారయ్య అంత్యక్రియలను నిర్వహించేందుకు కూడా కుటుంబ సభ్యులకు ఇబ్బందులు ఎదురవడంతో గ్రామస్తులు, దాతలు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి అంతిమయాత్రలను నిర్వహించారు. ఈ విషయం సామాజిక సేవకుడు చిలువేరు సమ్మిగౌడ్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు.ప్రస్తుతం సమ్మిగౌడ్ అత్యవసర పనుల నిమిత్తం అందుబాటులో లేకపోయినప్పటికీ, బాధలో ఉన్న ఆ కుటుంబాన్ని మరవకుండా తన ఫౌండేషన్ సభ్యులను ప్రత్యేకంగా పంపించి సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తక్షణ సాయంగా బియ్యం పంపిణీ చేయించారు. అవసరంలో ఉన్న కుటుంబానికి అండగా నిలుస్తూ తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సమ్మిగౌడ్ తరపున వెళ్లిన ఫౌండేషన్ సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కష్టకాలంలో వారు ఒంటరిగా లేరని, సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, "ప్రజల సమస్యలపై ఎప్పుడూ స్పందించే సమ్మిగౌడ్, తాను అందుబాటులో లేకపోయినా బాధలో ఉన్న ఈ కుటుంబాన్ని మరవకుండా వెంటనే సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం ద్వారా సమ్మిగౌడ్ నిజమైన సేవా నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు."ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత కుమార్, 8వ వార్డు సభ్యులు పలుస పద్మ వెంకన్న, 9వ వార్డు సభ్యులు తండా సంపత్, 12వ వార్డు సభ్యులు మంద ప్రవీణ్, మంద విక్రమ్, అడపా రమేష్, మంద సాయిబాబా, అంకిరెడ్డి రాంబాబు, నూకల లింగస్వామి, గద్దల హరీష్, కార్తీక్, దుర్గయ్య సురేష్, ప్రభాకర్, వెన్ను సురేందర్, పిట్టల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# "ప్రశ్న ప్రగతికి మూలం"

**రవీంద్ర భారతి వెలుతురు జూన్ 14:**




"ప్రశ్న ప్రగతికి మూలం "అని ప్రముఖ అభ్యుదయ కవి,రచయిత నగ్నముని అన్నారు. ఆదివారం రోజున మధ్యాహ్నం 3 గంటలకు పైడి జైరాజ్ ప్రివ్యూ థియేటర్ లో "ప్రశ్నించడమే నేరమా?" అన్న పుస్తకాన్ని ఆవిష్కరించి, ముఖ్య అతిథిగా ప్రసంగించారు. "ఐదవ తరగతి లోనే ప్రశ్నించి దండన ఎదుర్కొన్నానని, జీవితాంతం ప్రశ్నను వదల్లేదని, అందరూ ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని" ఆయన కోరారు. స్వేచ్ఛాలోచన సహ సంపాదకులు డి. హనుమంతరావు సభాధ్యక్షత వహించిన చార్వాకుల నుండి దబోల్కర్ వరకు ప్రశ్న పాలకులను ఎలా నిలదీసిందో గుర్తుచేశారు. మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు బి. సాంబశివరావు "ఈ పుస్తకం రాజ్యాంగం ప్రవచించినచిన పౌర విధులు ఆర్టికల్ 51 ఎ (హెచ్) స్ఫూర్తి తో సాగ్గిందని వివరించారు. ఆత్మీయ అతిథి డాక్టర్ గుత్తాజ్యోత్స్న గారు అభ్యుదయ కవిత చదివి, ప్రశ్నతో సంస్కరణలు సాధ్యమయ్యాయి అని పేర్కొన్నారు.తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడేసాబ్ మాట్లాడుతూ" రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి, గురజాడ నాటి వ్యవస్థను ప్రశ్నించడం వల్లనే చాలావరకూ మూఢనమ్మకాలు తగ్గాయని" సందేశమిచ్చారు.ఈ పుస్తకంలోని అధ్యాయాలు, వ్యాసాలు, అంశాలు, శైలి వంటి వాటిని ప్రముఖ రచయిత ఇసనాక మురళీధర్ కూలంకషంగా చర్చించి సభ్యులకు తెలియజేశారు .కుమారి యాన సంగీతం అందరినీ అలరించింది రచయిత తుమ్మా భాస్కర్ తన రచనల స్ఫూర్తికి మూలాలు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. మానవవాది భాసంపట్ల పద్మావతి గారి వందన సమర్పణతో కార్యక్రమం విజయవంతం అయింది.అతిథులు అందరినీ శాలువాలతో సత్కరించారు. అతిథులు రచయిత దంపతులను సత్కరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు భాషా చైతన్య సమితి, మానవ వికాస వేదిక సంయుక్త నిర్వహణలో ఈ పుస్తకావిష్కరణ సభ విజయవంతమైంది.

# ప్రజాగళం దామెర భూపాల్ జన్మదిన వేడుకలు

- పాల్గొన్న ఆరుట్ల గ్రామ సర్పంచ్ మనిపాటి శోభకుమార్, వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్

**మంచాల వెలుతురు జూన్ 14:**




మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రజాగళం దామెర భూపాల్ జన్మదిన వేడుకల్లో ముఖ్య అతిథిలుగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ వైయస్సార్ మాధగోనిజంగయ్యగౌడ్ పాల్గొని ప్రజాగళం దామెర భూపాల్ ను శాలువతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుట్ల గ్రామంలో ప్రజాప్రతినిధులు ఉన్న లేకపోయిన ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే ఏకైక గొప్ప సేవకుడు ప్రజాగణం దామర భూపాల్ అని అన్నారు రాబోయే రోజుల్లో ప్రజాగళందామెర భూపాల్ ప్రజాప్రతినిధి హోదాలో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని అన్నారు కార్యక్రమంలో యువకులు బైకని మహేందర్ యాదవ్ ఆడెపు బాలరాజు ఆలువాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అచ్చంపేట విద్యార్థులకు విజయ్ దేవరకొండ- రష్మిక చేయూత

- 180 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సాయం
- 'ది దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు
- 9, 10వ తరగతుల్లో ఫస్ట్, సెకండ్ ర్యాంకర్లకు ప్రోత్సాహం
- 'మెరిట్ స్కాలర్‌షిప్ అవార్డ్స్–2026'కు విద్యార్థుల ఎంపిక
- ఎంపికైన వారి జాబితాను స్వయంగా ప్రకటించిన విజయ్ దేవరకొండ
- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల విద్యార్థులకు లబ్ధి
- విద్య ద్వారానే భవిష్యత్ నిర్మాణమన్న సందేశం
- సోషల్ మీడియాలో వివరాలు వెల్లడించిన హీరో
- తమ్మున్‌పేట్ గ్రామంతో కుటుంబ అనుబంధాన్ని గుర్తుచేసిన విజయ్
- విద్యార్థుల విజయాలకు అభినందనలు తెలిపిన స్టార్ జంట

**అచ్చంపేట వెలుతురు జూన్ 14:**



సినీ నటుడు విజయ్ దేవరకొండ, నటి రష్మిక మందన్న మరోసారి తమ సేవా కార్యక్రమాలతో ప్రశంసలు అందుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట మండలానికి చెందిన ప్రతిభావంతులైన 180 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు. 'ది దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మెరిట్ స్కాలర్‌షిప్ అవార్డ్స్–2026' కార్యక్రమం ద్వారా ఈ సహాయం అందించనున్నారు.అచ్చంపేట మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ, 10వ తరగతుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఎంపికైన 180 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందించి వారి విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించనున్నారు.ఈ విషయాన్ని విజయ్ దేవరకొండ ఆదివారం తన సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. 'మేము తమ్మున్‌పేట్‌కు వెళుతున్నాము. ఆ గ్రామంలోనే మా నాన్న జన్మించారు. మా చిన్న కలకు సంబంధించి నేను, రష్మిక ఫిబ్రవరి నెలలో ఒక ప్రకటన చేశాం. తెలంగాణలోని అచ్చంపేట మండలంలో 9, 10వ తరగతుల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పాం. తమ తల్లిదండ్రులు గర్వపడేలా చేసిన ఆ 180 మంది విద్యార్థుల జాబితా ఇదే' అని ఆయన పోస్టులో పేర్కొన్నారు.అనంతరం 'మెరిట్ స్కాలర్‌షిప్ అవార్డ్స్–2026'కు ఎంపికైన విద్యార్థుల పూర్తి జాబితాకు సంబంధించిన చిత్రాలను కూడా షేర్ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం లభించడంతో పాటు, మరింత మెరుగైన విద్యాభ్యాసానికి మార్గం సుగమం కానుందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.సినీ రంగంలో స్టార్‌డమ్‌ను ఆస్వాదిస్తున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న సామాజిక బాధ్యతలో భాగంగా విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.

# ఖరీఫ్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించిన మంత్రి తుమ్మల

- తక్కువ నీటితో సాగయ్యే కందులు, పెసలు, మినుములు వంటి పంటలను ప్రోత్సహిస్తున్నాము
- ఈ ఖరీఫ్ కు 87 లక్షల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి
- రైతులకు మరింత సౌకర్యవంతంగా ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో మార్పులు
- ఎల్.ని.నో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయశాఖ
- వాతావరణ సమాచారాన్ని నేరుగా రైతులకు చేరవేసే తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం విజయవంతం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**



ఖరీఫ్ సన్నద్ధతపై ఆదివారం రోజున ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ఏప్రిల్ నెలలోనే వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వాతావరణ శాఖ నిపుణులతో సమీక్ష నిర్వహించి ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. వర్షాలు ఆలస్యమైనా, తక్కువగా నమోదైనా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ సాగు ప్రణాళికలను రూపొందించినట్లు పేర్కొన్నారు.వరి పంటలపై అధికంగా ఆధారపడకుండా రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, నువ్వులు, ఆముదం వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. విత్తనాల కొరత తలెత్తకుండా ఈ ఖరీఫ్ సీజన్‌కు 87.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచామని, ముఖ్యంగా కందులు, జొన్నలు, మొక్కజొన్న, సజ్జలు వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను జిల్లాల్లో ముందుగానే నిల్వ చేసినట్లు మంత్రి వివరించారు.రాష్ట్రంలోని రైతులకు ఎరువుల లభ్యతను మరింత సులభతరం చేయడం, పంపిణీ ప్రక్రియలో పారదర్శకతను పెంచడం లక్ష్యంగా వ్యవసాయశాఖ పలు కీలక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. రబీ సీజన్‌లో రైతుల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాల ఆధారంగా రాష్ట్ర ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో పలు మెరుగుదలలు చేసినట్లు వెల్లడించారు. జిల్లా వారీగా డీలర్ల స్టాక్ నిర్వహణ, మండల మ్యాపింగ్ సదుపాయాలతో పాటు మీ సేవ కేంద్రాల ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. యాప్ వినియోగంతో ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద రద్దీ తగ్గడంతో పాటు పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతుందని మంత్రి తెలిపారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో ఎల్‌నినో ప్రభావం కనిపించే అవకాశం ఉన్నందున వ్యవసాయశాఖ ముందస్తుగా పంటల ప్రణాళికను సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. వర్షపాతంలో అనిశ్చిత పరిస్థితులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు, విత్తనాలు, ఎరువుల లభ్యత, రైతులకు సాంకేతిక సూచనలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. రైతులు స్థానిక వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయశాఖ సూచనలను పాటించాలని కోరారు.రైతులకు ఖచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు వ్యవసాయ శాఖ "తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం"ను అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మండలాల వారీగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలి వేగం తదితర వాతావరణ వివరాలు రైతులకు నేరుగా వాట్సాప్ సందేశాల ద్వారా చేరుతున్నాయని చెప్పారు. రైతులు విత్తనాలు వేయడం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ వంటి అంశాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 28 లక్షల మందికి పైగా రైతులకు వాతావరణ సమాచార సందేశాలు పంపించినట్లు చెప్పారు. 71 శాతం డెలివరీ రేటుతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, పంట నష్టాలను తగ్గించడం లక్ష్యంగా ఇటువంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# సింగరేణిపై దుష్ప్రచారం మానాలి: భట్టి విక్రమార్క

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**

సింగరేణి బొగ్గు నిల్వలు మాయమయ్యాయంటూ వస్తున్న ఆరోపణలను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు (ఓసీపీ) వద్ద ఆదివారం సింగరేణి అధికారులతో కలిసి నిర్వహించిన ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల శ్రమ, చెమట, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిపై వస్తున్న ఆరోపణలు తన మనసును కలచివేశాయని, అందుకే ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు.రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ భవిష్యత్తుకు వెన్నెముకగా ఉన్న సింగరేణి సంస్థను అపహాస్యం చేయవద్దని సూచించారు. గనుల నుంచి వెలికితీసిన బొగ్గును గ్రేడ్‌ల వారీగా నిల్వ చేస్తామని, ఆ నిల్వలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయని వివరించారు. బొగ్గు తరలించే ప్రతి వాహనానికి జీపీఎస్ వ్యవస్థ అమర్చినట్లు, విజిలెన్స్ విభాగం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. కిలో బొగ్గు కూడా అక్రమంగా బయటకు వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు.అనంతరం మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ బీఎల్ఏల సమావేశంలో పాల్గొన్న భట్టి విక్రమార్క, ఎస్ఐఆర్ ప్రక్రియపై తీవ్ర విమర్శలు చేశారు. ఎస్ఐఆర్‌ను అడ్డంపెట్టుకుని అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఓటు హక్కు కోల్పోతే పౌరసత్వానికే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే ఓటర్లను ఏఐ టెక్నాలజీ ద్వారా గుర్తించి జాబితాలు తయారు చేస్తున్నారని, వారి పేర్లను హోల్డ్‌లో పెడుతున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకులు పథకం ప్రకారమే ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు గ్రామాల్లో విస్తృత ప్రచారం ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఓటర్ల మ్యాపింగ్ సక్రమంగా జరగలేదని, దాదాపు 80 వేల మంది ఓటర్లు అన్‌మ్యాపింగ్ అయ్యారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సింగరేణిపై కొందరు నిరంతరం అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పదేపదే అబద్ధాలు చెబుతూ గత తప్పులను కప్పిపుచ్చుకోలేరని అన్నారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సింగరేణిని రక్షించేది కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో గొంతెత్తిన కాక్రోచ్ జనతా పార్టీ

- **విద్యా వ్యవస్థలో అవకతవకలపై తీవ్ర విమర్శలు**
- **కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**
- **విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దని హెచ్చరిక**
- **నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీసిన నేతలు**
- **యువతను 'కాక్రోచ్‌లు'గా అభివర్ణించడంపై ఆగ్రహం**
- **నైపుణ్యాభివృద్ధిలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపిన వక్తలు**
- **విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**

దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పరీక్షా పత్రాల లీకేజీలు, విద్యా వ్యవస్థలో నెలకొన్న అవకతవకలు, నిరుద్యోగ సమస్యలు, విద్యార్థుల భవిష్యత్తుపై పెరుగుతున్న అనిశ్చితిని నిరసిస్తూ ధర్నాచౌక్ వద్ద పెద్దఎత్తున ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త, సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరులతో పాటు వందలాది మంది యువత, విద్యార్థులు పాల్గొన్నారు.నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంతో దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనను ప్రస్తావించిన నిరసనకారులు, విద్యా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.సభను ఉద్దేశించి మాట్లాడిన ఆకునూరి మురళి కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో అపారమైన సంపద ఉన్నప్పటికీ యువతకు ఉపాధి అవకాశాలు ఎందుకు కల్పించలేకపోతున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో యువత ఆవేదనను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

''దేశంలో ఆరు శాతం మంది యువతకు మాత్రమే తగిన నైపుణ్యాలు ఉన్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మిగతా యువతకు నైపుణ్యాలు అందించే వ్యవస్థ ఎందుకు అభివృద్ధి కాలేదు? విద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వ వైఫల్యాల కారణంగా యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది'' అని ఆయన అన్నారు.

యువతను 'కాక్రోచ్‌లు'గా అభివర్ణించడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని పేర్కొన్న ఆయన, విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను సహించబోమన్నారు. నీట్ లీకేజీ వ్యవహారంలో లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే కాకుండా, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న యువత, విద్యార్థి సంఘాల ప్రతినిధులు విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి

- **జామ్‌నగర్ నుంచి అమెరికాకు వెళ్లిన ఇంధన ఉత్పత్తులు**
- **అంతర్జాతీయ ఆంక్షల మధ్య బలపడుతున్న భారత్-రష్యా ఇంధన బంధం**

**ఢిల్లీ వెలుతురు జూన్ 14:**

ప్రపంచ రాజకీయాలు ఒక దిశలో సాగుతుంటే, ఇంధన మార్కెట్లు మరో దిశలో పయనిస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యాపై పాశ్చాత్య దేశాలు కఠిన ఆంక్షలు విధించినప్పటికీ, ప్రపంచంలోని పలు దేశాలు తమ ఇంధన అవసరాల కోసం ఇంకా రష్యాపైనే ఆధారపడుతున్నాయి. ఆ జాబితాలో భారత్ కీలక స్థానాన్ని ఆక్రమించింది. తక్కువ ధరలకు లభిస్తున్న రష్యా క్రూడ్ ఆయిల్‌ను భారీగా దిగుమతి చేసుకుంటూ ప్రపంచంలోనే రష్యా ఇంధనాల రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్ కొనసాగుతోంది.సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం మే 2026 నెలలో భారత్ సుమారు 5.8 బిలియన్ యూరోల విలువైన రష్యా ఇంధనాలను కొనుగోలు చేసింది. డాలర్లలో ఇది దాదాపు 6.7 బిలియన్లకు సమానం. రష్యా నుంచి వస్తున్న చమురు సరఫరాలు పెరగడంతో భారత ఇంధన దిగుమతుల్లో కూడా గణనీయమైన వృద్ధి నమోదైంది.

### క్రూడ్ ఆయిల్‌దే సింహభాగం

భారత్ దిగుమతి చేసుకున్న రష్యా ఇంధనాల్లో అత్యధిక వాటా క్రూడ్ ఆయిల్‌దే. మొత్తం కొనుగోళ్లలో దాదాపు 83 శాతం క్రూడ్ ఆయిల్‌గా నమోదైంది. దీని విలువ 4.8 బిలియన్ యూరోలుగా ఉంది. చమురు ఉత్పత్తుల దిగుమతులు 550 మిలియన్ యూరోలు కాగా, బొగ్గు దిగుమతులు 429 మిలియన్ యూరోలుగా నమోదయ్యాయి.మే నెలలో భారత్ మొత్తం క్రూడ్ ఆయిల్ దిగుమతులు 8 శాతం పెరిగితే, రష్యా నుంచి వచ్చిన చమురు దిగుమతులు ఏకంగా 21 శాతం పెరగడం విశేషం. ఇది భారత ఇంధన వ్యూహంలో రష్యా ప్రాధాన్యత ఎంత పెరిగిందో స్పష్టంగా తెలియజేస్తోంది.

### రిఫైనరీల్లో పెరిగిన రష్యా చమురు వినియోగం

దేశంలోని ప్రధాన రిఫైనరీ కేంద్రాలు రష్యా చమురును మరింతగా వినియోగిస్తున్నాయి. గుజరాత్‌లోని వడినార్ రిఫైనరీలో ఏప్రిల్‌తో పోలిస్తే మే నెలలో రష్యా క్రూడ్ చేరికలు 36 శాతం పెరిగాయి. జామ్‌నగర్ రిఫైనింగ్ సముదాయంలో ఈ పెరుగుదల 14 శాతంగా నమోదైంది.గత ఏడాది చివర్లో కొన్ని ప్రభుత్వ రంగ రిఫైనరీలు రష్యా చమురు కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేసినా, ఈ ఏడాది మార్చి నుంచి మళ్లీ దిగుమతులు ప్రారంభించాయి. ఫలితంగా కర్ణాటకలోని న్యూ మంగళూరు రిఫైనరీలో రష్యా చమురు వినియోగం 13 శాతం పెరిగింది.ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం రిఫైనరీలో అయితే రష్యా క్రూడ్ వినియోగం 42 శాతం పెరగడం గమనార్హం. ఒడిశాలోని పరదీప్ రిఫైనరీ కూడా గత రెండేళ్లలోనే అత్యధిక స్థాయిలో రష్యా చమురును స్వీకరించినట్లు నివేదిక వెల్లడించింది.

### తగ్గింపు ధరలే ప్రధాన కారణం

ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు విధించడంతో రష్యా తన చమురును తక్కువ ధరలకు విక్రయించడం ప్రారంభించింది. ఈ అవకాశాన్ని భారత్ సమర్థంగా వినియోగించుకుంది. అంతర్జాతీయ మార్కెట్ ధరలతో పోలిస్తే తక్కువ ధరలకు చమురు లభించడం వల్ల భారత రిఫైనరీలకు భారీగా లాభాలు చేకూరుతున్నాయి.ఇంధన దిగుమతుల వ్యయం తగ్గడంతో పాటు దేశీయంగా పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా వ్యవస్థ కూడా స్థిరంగా కొనసాగుతోంది. అందుకే రష్యా చమురు భారత మార్కెట్‌లో కీలక పాత్ర పోషిస్తోంది.

### చైనా తర్వాత భారత్‌దే రెండో స్థానం

సీఆర్ఈఏ నివేదిక ప్రకారం మే 2026లో రష్యా క్రూడ్ ఎగుమతుల్లో 50 శాతం వాటాను చైనా కొనుగోలు చేసింది. 36 శాతం వాటాతో భారత్ రెండో స్థానంలో నిలిచింది. తుర్కియే 6 శాతం, యూరోపియన్ యూనియన్ 5 శాతం వాటాలతో తదుపరి స్థానాల్లో ఉన్నాయి.ఈ గణాంకాలు ప్రపంచ ఇంధన మార్కెట్లో ఆసియా దేశాల ప్రభావం ఎంతగా పెరిగిందో సూచిస్తున్నాయి. ముఖ్యంగా చైనా, భారత్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు రష్యా చమురుకు ప్రధాన కొనుగోలుదారులుగా మారాయి.

### ఆంక్షలు ఉన్నా కొనసాగుతున్న వాణిజ్యం

రష్యా క్రూడ్‌తో తయారైన చమురు ఉత్పత్తుల దిగుమతులపై యూరోపియన్ యూనియన్ నిషేధం విధించినప్పటికీ, రిఫైనరీల ద్వారా పరోక్షంగా ఆ చమురు ప్రపంచ మార్కెట్లకు చేరుతూనే ఉంది. భారత్, తుర్కియే, బ్రూనై, జార్జియా దేశాల్లోని రిఫైనరీలు రష్యా క్రూడ్‌ను శుద్ధి చేసి వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి.మే నెలలో మాత్రమే ఈ దేశాల నుంచి సుమారు 641 మిలియన్ యూరోల విలువైన చమురు ఉత్పత్తులు యూరోపియన్ యూనియన్, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలకు చేరినట్లు నివేదిక వెల్లడించింది.


### జామ్‌నగర్ నుంచి అమెరికాకు

భారతదేశంలోని అతిపెద్ద రిఫైనింగ్ కేంద్రాల్లో ఒకటైన గుజరాత్‌లోని జామ్‌నగర్ రిఫైనరీ కూడా ఈ పరిణామాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. సీఆర్ఈఏ నివేదిక ప్రకారం అమెరికాకు ఎగుమతి అయిన కొన్ని చమురు ఉత్పత్తులు జామ్‌నగర్ రిఫైనరీ నుంచే వెళ్లాయి. గత మూడు నెలల కాలంలో ఆ రిఫైనరీ వినియోగించిన క్రూడ్‌లో సుమారు 15 శాతం రష్యా చమురేనని వెల్లడించింది.

### ఇంధన భద్రతకు వ్యూహాత్మక నిర్ణయం

భారత్‌కు చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ ధరలకు లభిస్తున్న రష్యా చమురును కొనుగోలు చేయడం కేవలం వాణిజ్య నిర్ణయం మాత్రమే కాదు.. ఇంధన భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక చర్యగా కూడా భావిస్తున్నారు.

అంతర్జాతీయ రాజకీయ ఒత్తిళ్లు, ఆంక్షలు కొనసాగుతున్నప్పటికీ భారత్ తన ఇంధన అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోంది.రష్యా చమురుపై పెరుగుతున్న ఆధారపడటం ఒకవైపు భారత్‌కు ఆర్థిక ప్రయోజనాలు అందిస్తుండగా, మరోవైపు ప్రపంచ ఇంధన వాణిజ్యంలో కొత్త సమీకరణాలకు కూడా దారితీస్తోంది. ప్రపంచ రాజకీయాలు ఎలా మారినా, ఇంధన అవసరాలే దేశాల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయనడానికి భారత్–రష్యా చమురు వాణిజ్య సంబంధాలు తాజా ఉదాహరణగా నిలుస్తున్నాయి.




# మేధో తెలంగాణా కోసం

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో ప్రత్యేక సమాచారాన్ని కూడా అందించామని, ఈ పుస్తకంలో కరెంట్ అఫైర్స్ మాత్రమే కాక ప్రతి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థికి కావలసిన సాధారణ పరిజ్ఞానాన్ని, భారత రాజ్యాంగం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, భౌగోళిక శాస్త్రం, భారతదేశ చరిత్ర, తెలంగాణ చరిత్ర, ఉద్యమం వంటి విశేషాలను ఎన్నిటినో ఈ పుస్తకం అందిస్తుందని, ఇలాంటి పుస్తకాన్ని బిసి స్టడీ సర్కిల్ ప్రచురించడం సంతోషదాయకమనీ, దీనికి సంపాదకత్వం వహించి ఈ పుస్తకాన్ని ప్రచురించిన డైరెక్టర్ మామిడి హరికృష్ణ అభినందిస్తున్నానని ఆయన అన్నారు.ఉన్నత విద్యావంతులైన యువత ప్రజలకు సేవ చేయడానికి ఉన్న ఒక చక్కని మార్గం ప్రభుత్వోద్యోగం అనీ, అలాంటి ప్రభుత్వ ఉద్యోగాలలో సివిల్ సర్వీసెస్, గ్రూప్ పరీక్షలు, బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమీషన్, పోలీస్, రైల్వే, ఉపాధ్యాయులు లాంటి ఉద్యోగాల ఎంపికకు సంబంధించిన పోటీ పరీక్షల కోచింగ్ కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తూ అభ్యర్థులకు శిక్షణను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 బీసి స్టడీ సర్కిల్ ల ద్వారా అందిస్తోందనీ, ఈ శిక్షణ ను సక్రమంగా ఉపయోగించుకుని యువత ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలనీ ఆయన చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమంటే అది ఆ విజేతకు మాత్రమే కాక , వారి కుటుంబానికి, పుట్టిన ఊరుకి, జిల్లాకు, రాష్ట్రానికి కూడా గర్వ కారణమనీ, అలాగే ప్రభుత్వ ఉద్యోగం చేయడమంటే జాతి నిర్మాణం లో భాగస్వాములు కావడమే అనీ ఆయన చెప్పారు.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి అఖిల భారత ఉద్యోగాలను అత్యధిక సంఖ్యలో తెలంగాణా యువత సాధించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందనీ, దానికోసం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి మార్గదర్శకత్వంలో "రాజీవ్ అభయ హస్తం" పేరిట ప్రతి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలకు అర్హత సాధించిన అభ్యర్థికి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ, తెలంగాణ యువత కలల్ని సాకారం చేసే ప్రయత్నం చేస్తున్నదనీ ఆయన గుర్తు చేశారు.ఇటీవల విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్లు డీఈవో, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ తదితర ఉద్యోగాలతో పాటు రాబోయే నోటిఫికేషన్లకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా బీసీ స్టడీ సర్కిల్ ముందుకు పోతుంది.ఈ సందర్భంగా యువత పోటీపరీక్షల వైపు దృష్టి సారించి, ఆత్మ స్థైర్యంతో, మొక్కవోని దీక్షతో, ప్రణాళికా బద్ధంగా బాగా చదవి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ప్రభుత్వ ఉద్యోగాలను గెలుచుకోవాలనీ, మేధో శక్తిలో సైతం తెలంగాణ యువత జయ కేతనం ఎగురవేయాలనీ శ్రీ పొన్నం ప్రభాకర్, బీసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రివర్యులు యువతకు సూచించారు.

# ప్రకాశం బ్యారేజీకి వరద నీరు.. నాలుగు గేట్లు ఎత్తి విడుదల

- **బందరు, రైవస్ కాలువలకు 2,211 క్యూసెక్కుల నీటి సరఫరా**
- **ఇసుక రీచ్‌లలో పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**
- **నీటి ప్రవాహాన్ని బట్టి విడుదలలో మార్పులు**
- **కృష్ణా డెల్టా కాలువల అవసరాలకు అనుగుణంగా చర్యలు**
- **జులై 1 నుంచి ఖరీఫ్‌కు నీరందించే అవకాశం**
- **మరో 3-4 రోజులు వరద ప్రవాహం కొనసాగొచ్చని అంచనా**

**విజయవాడ వెలుతురు జూన్ 14:**

మున్నేరు పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద నీరు చేరుతోంది. దీంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమై బ్యారేజీ నుంచి నీటి విడుదల చేపట్టారు. శనివారం ఉదయం ప్రకాశం బ్యారేజీలోని నాలుగు గేట్లను అడుగుమేర ఎత్తి 2,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.అదేవిధంగా కృష్ణా డెల్టా పరిధిలోని బందరు, రైవస్ కాలువలకు కలిపి 2,211 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. నదిలోకి వస్తున్న వరద ప్రవాహం, కాలువల ద్వారా సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి విడుదలను ఎప్పటికప్పుడు సర్దుబాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రివర్ కన్సర్వేటర్ ఆర్. రవికిరణ్ మాట్లాడుతూ.. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లలో పనిచేస్తున్న సిబ్బంది, కాంట్రాక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదిలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.ప్రస్తుతం కృష్ణా నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో మరో మూడు నుంచి నాలుగు రోజుల పాటు నీటి రాక కొనసాగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. నీటి ప్రవాహం పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైతే మరిన్ని గేట్లు ఎత్తి నీటి విడుదల చేపట్టే అవకాశముందని తెలిపారు.ఖరీఫ్ సాగు సీజన్‌కు సంబంధించి కృష్ణా డెల్టా రైతులకు జులై 1 నుంచి సాగునీరు అందించే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఇందుకు అవసరమైన నీటి నిల్వలు, ప్రవాహ పరిస్థితులను సమీక్షిస్తూ ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వరద నీటి రాకతో కృష్ణా డెల్టా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# మమతకు లీగల్ నోటీసులు.. టీఎంసీలో కలకలం

**పశ్చిమ బెంగాల్ వెలుతురు జూన్ 14:**

పశ్చిమ బెంగాల్ అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. పార్టీ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ కుమారుడు డాక్టర్ బైద్యనాథ్ ఘోష్ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు పలువురు టీఎంసీ సీనియర్ నేతలకు లీగల్ నోటీసులు జారీ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బరసత్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తాను పార్టీ టికెట్ కోరినట్లు చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.మమతా బెనర్జీతో పాటు టీఎంసీ ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, సౌగతా రాయ్, మహువా మొయిత్రాలకు కూడా నోటీసులు పంపినట్లు బైద్యనాథ్ ఘోష్ వెల్లడించారు. తమపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, అవి తమ కుటుంబ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. నిర్దిష్ట గడువులోగా క్షమాపణలు చెప్పకపోతే పరువు నష్టం దావా వేయనున్నట్లు హెచ్చరించారు.ఈ నెల ప్రారంభంలో జరిగిన ఓ పార్టీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ బరసత్ అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ కోసం కొందరు తనను సంప్రదించారని వ్యాఖ్యానించారు. అయితే పార్టీ సీనియర్ నాయకత్వం అందుకు అంగీకరించకపోవడంతో ఆ అభ్యర్థనను తిరస్కరించినట్లు తెలిపారు. ఒకరు ఎంపీ అయినంత మాత్రాన కుటుంబ సభ్యులందరికీ ఎమ్మెల్యే లేదా ఎంపీ పదవులు ఇవ్వాలా అంటూ పరోక్షంగా కకోలీ ఘోష్ కుటుంబాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాలు భావించాయి.ఈ వ్యాఖ్యల అనంతరం కకోలీ ఘోష్ టీఎంసీకి దూరమవడం, అనంతరం ఎన్డీఏకు మద్దతు ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. తన కుమారుడికి టికెట్ ఇవ్వనందుకే కకోలీ పార్టీని వీడి ఎన్డీఏ వైపు వెళ్లారని టీఎంసీ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను డాక్టర్ బైద్యనాథ్ ఘోష్ తీవ్రంగా ఖండించారు. తాను ఎప్పుడూ ఎలాంటి ఎన్నికల టికెట్ కోసం ప్రయత్నించలేదని, రాజకీయ పదవులపై ఆసక్తి చూపలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబ గౌరవానికి భంగం కలిగించేలా చేసిన వ్యాఖ్యలను సహించబోమని తెలిపారు.ఇదిలా ఉండగా, టీఎంసీకి వరుసగా నేతల వలసలు ఎదురవుతున్న నేపథ్యంలో పార్టీ పునర్వ్యవస్థీకరణపై మమతా బెనర్జీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇటీవలే టీఎంసీ యువజన విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన సయోని ఘోష్ ఎన్డీఏకు మద్దతు ప్రకటించడంతో పార్టీ అధిష్ఠానం అప్రమత్తమైంది. ఆమె స్థానంలో అర్నబ్ బెనర్జీని యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.అలాగే తృణమూల్ మహిళా కాంగ్రెస్‌లో కూడా కీలక మార్పులు చేపట్టినట్లు సమాచారం. కోల్‌కతా దక్షిణ ఎంపీ మాలా రాయ్ స్థానంలో కలిగంజ్ ఎమ్మెల్యే అలీఫా అహ్మద్‌ను మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీని వీడుతున్న నేతల ప్రభావాన్ని తగ్గించేందుకు, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.రెబల్ నేతల వ్యవహారం, లీగల్ నోటీసులు, సంస్థాగత మార్పులు ఒకేసారి చోటుచేసుకోవడంతో టీఎంసీలో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ వివాదంపై మమతా బెనర్జీ లేదా ఇతర నేతలు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీలో టీఎంసీ తిరుగుబాటు ఎంపీలు విలీనం

- **లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన 20 మంది ఎంపీలు**
- **కేంద్రంలో ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటన**
- **మమతా బెనర్జీకి భారీ షాక్**
- **2/3 వంతుల బలంతో తిరుగుబాటుదారుల సంచలనం**
- **తామే నిజమైన టీఎంసీ.. విలీనంతో పాటు కోర్టుకు వెళ్తామన్న సుదీప్ బెనర్జీ**

**న్యూఢిల్లీ, వెలుతురు జూన్ 14:**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో రేగిన తిరుగుబాటు జాతీయ రాజకీయాల్లో పెను సంచలనానికి దారితీసింది. టీఎంసీకి చెందిన 20 మంది తిరుగుబాటు లోక్‌సభ ఎంపీలు త్వరలోనే 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో విలీనం కానున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తిరుగుబాటు ఎంపీ కాకోలి ఘోష్ దస్తీదార్ ఆదివారం అధికారికంగా వెల్లడించారు. ఈ మేరకు తిరుగుబాటు ఎంపీలంతా ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఆయన నివాసంలో కలిసి, సభలో తమకు ప్రత్యేక సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఒక లేఖను సమర్పించారు.ఈ సందర్భంగా కాకోలి ఘోష్ దస్తీదార్ మాట్లాడుతూ.. "టీఎంసీ నుంచి ఎన్నికైన 20 మంది ఎంపీలం స్పీకర్‌ను కలిసి ప్రత్యేకంగా కూర్చోవడానికి అనుమతించాలని కోరాం. మొత్తం పార్టీ బలాబలాల్లో రెండు బై మూడు వంతుల కంటే ఎక్కువ మందిమి మా వైపే ఉన్నాం. మేమంతా నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీలో విలీనమవుతున్నాం. ఇకపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం



కోసం, ఎన్డీయే కూటమితో కలిసి పనిచేస్తాం" అని స్పష్టం చేశారు. మరో సీనియర్ నేత సుదీప్ బెనర్జీ మాట్లాడుతూ.. తాము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీలో విలీనమైనప్పటికీ, తామే నిజమైన టీఎంసీ అని క్లెయిమ్ చేస్తామని, ఈ వ్యవహారాన్ని కోర్టుకు కూడా తీసుకెళ్తామని వెల్లడించారు.స్పీకర్‌ను కలవడానికి ముందు ఈ తిరుగుబాటు ఎంపీలు కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో పాటు త్రిపుర మాజీ సీఎం, బీజేపీ ఎంపీ విప్లవ్ కుమార్ దేవ్‌తో సుదీర్ఘంగా సమావేశమై విలీన ప్రతిపాదనలపై చర్చించారు. మమతా బెనర్జీకి అత్యంత ఆప్తుడిగా భావించే సుదీప్ బందోపాధ్యాయ శనివారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయిన మరుసటి రోజే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. తిరుగుబాటు క్యాంపులో మరో ఇద్దరు ఎంపీలు చేరబోతున్నారని, దీంతో లోక్‌సభలో తమ బలం 22కు చేరుతుందని రెబెల్ నేతలు పేర్కొంటున్నారు. ఈ భారీ చీలికతో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి కోలుకోలేని దెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# వినియోగదారులం కాదు.. పరిష్కర్తలం: ప్రధాని మోదీ

- **గ్లోబల్ సొల్యూషన్స్‌కు కేరాఫ్ అడ్రస్ ఇండియా**
- **ఒకప్పటి టెక్నాలజీ వినియోగదారుడే నేడు ప్రపంచ సమస్యలకు సమాధానం**
- **ఫ్రాన్స్ దేశపు 'నీస్' నగరంలో 'భారత్ ఇన్నోవేట్స్ 2026' సదస్సు ప్రారంభం**
- **మానవీయ కోణంలోనే సాంకేతిక ఆవిష్కరణలు**
- **ఫ్రెంచ్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ కీలక భేటీ**

**ఇంటర్నెట్ డెస్క్, వెలుతురు జూన్ 14:**

ఒక దశాబ్దం క్రితం వరకు ప్రపంచ దేశాలన్నీ భారత దేశాన్ని కేవలం సాంకేతికతను స్వీకరించే ఒక వినియోగదారుడిగా మాత్రమే చూశాయని, కానీ నేడు భారత్ ప్రపంచ సమస్యలకు అత్యంత ఆధునిక పరిష్కారాలను అందించే దేశంగా అవతరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ వేదికపై సగర్వంగా ప్రకటించారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా నీస్ నగరంలో ఘనంగా ప్రారంభమైన 'భారత్ ఇన్నోవేట్స్ 2026' అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ యువత సాధిస్తున్న సాంకేతిక



ప్రగతిని, దేశ భవిష్యత్తు విజన్‌ను ప్రపంచ దేశాల ముందు ఉంచారు. సాంకేతిక ఆవిష్కరణలు కేవలం ఆర్థిక విలువలతోనే కాకుండా, సమాజంలో అందరినీ కలుపుకు పోయేలా, మానవాళికి మేలు చేసేలా ఉండాలన్నదే దేశ ప్రాధాన్యత అని మోదీ స్పష్టం చేశారు.

ఈ ప్రతిష్టాత్మక సదస్సును ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో కలిసి ప్రధాని మోదీ ప్రారంభించారు. భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఉన్న బంధం కేవలం వ్యూహాత్మకమైనది మాత్రమే కాదని.. నమ్మకం, పరస్పర విలువలు, ఆవిష్కరణలతో కూడిన బలమైన భాగస్వామ్యమని మోదీ అభివర్ణించారు. దేశంలో సాంకేతికత, రక్షణ, అంతరిక్షం, బయోటెక్నాలజీ, న్యూక్లియర్ ఎనర్జీ వంటి కీలక రంగాలలో ప్రారంభమైన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని, స్టార్టప్‌ల వృద్ధి మరింత వేగంగా కొనసాగుతుందని ప్రపంచ ఇన్వెస్టర్లకు భరోసా ఇచ్చారు. మాక్రాన్ సైతం భారత్‌ను "ఆవిష్కరణల దేశం"గా కొనియాడుతూ.. క్లైమేట్ చేంజ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ రంగాలలో భారత్‌తో కలిసి నడుస్తామని ప్రకటించారు.ఈ సదస్సులో భాగంగా ఇరు దేశాల శాస్త్ర సాంకేతిక పురోగతి కోసం సరికొత్త "ఇన్నోవేషన్ రోడ్‌మ్యాప్ 2030" ను ఇరు దేశాల అధినేతలు ఆవిష్కరించారు. ఈ రోడ్‌మ్యాప్‌లో భాగంగా రక్షణ, అంతరిక్ష రంగాలలో కేవలం కొనుగోలుదారు–విక్రేత సంబంధాలకే పరిమితం కాకుండా.. సంయుక్త డిజైన్, సహ–అభివృద్ధి, ఉమ్మడి ఉత్పత్తి దిశగా అడుగులు వేయనున్నారు. అలాగే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బాధ్యతాయుత వినియోగం కోసం ఒక జాయింట్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఫ్రాన్స్‌లో భారతదేశపు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ విస్తరణను అధ్యక్షుడు మాక్రాన్ సాదరంగా స్వాగతించారు. ఏవియేషన్ రంగంలో నైపుణ్యాల పెంపు కోసం భారతదేశంలోని కాన్పూర్‌లో సరికొత్త 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.భారత్–ఫ్రాన్స్ 'ఇన్నోవేషన్ ఇయర్' ఉమ్మడి చొరవలో భాగంగా జరిగిన ఈ సదస్సులో వందకు పైగా భారతీయ అగ్రశ్రేణి స్టార్టప్‌లు, ప్రముఖ విద్యాసంస్థలు, వందలాది అంతర్జాతీయ ఇన్వెస్టర్లు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో గ్లోబల్ సప్లై చైన్‌ను బలోపేతం చేయడంలో భారత్ అత్యంత కీలక పాత్ర పోషించబోతోందని ఈ సదస్సు ద్వారా స్పష్టమైంది.

# వర్షాకాల సన్నద్ధతకు టీజీఎస్పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు

**24 గంటలూ క్షేత్రస్థాయిలో అధికారులు**

**హైదరాబాద్, వెలుతురు జూన్ 14:**



వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని ఆపరేషన్ కేంద్రాల్లో విద్యుత్ వ్యవస్థల బలోపేతానికి యుద్ధప్రాతిపదికన ముందస్తు చర్యలు చేపట్టారు. జూన్ 10న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క నిర్వహించిన సమీక్షా సమావేశం ఆదేశాల మేరకు, భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలోనూ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు సంస్థ సన్నద్ధతను వేగవంతం చేసింది.సీఎండీ శ్రీ జితేష్ వి. పాటిల్ మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తమై దెబ్బతిన్న, శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, లూజ్ లైన్ల సవరణ పనులను ముమ్మరం చేశారు. భారీ వర్షాల వల్ల చెట్ల కొమ్మలు లైన్లపై పడి జరిగే ప్రమాదాలను నివారించేందుకు విస్తృతంగా 'ట్రీ ట్రిమ్మింగ్' డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ పనుల నిర్వహణకు ముందు స్థానిక ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ అవసరమైన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.ఈ అత్యవసర నిర్వహణ పనుల కోసం సంస్థ కొత్తగా 168 పోల్ ప్రూనర్లు, 59 చైన్‌సాలు, 530 ప్రూనింగ్ కట్టర్లను సమకూర్చుకుంది. క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు 189 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వాహనాలను సిద్ధంగా ఉంచడంతో పాటు, కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో "ఫ్యూజ్ ఆఫ్ కాల్" సేవల కోసం 213 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.వినియోగదారుల ఫిర్యాదుల కోసం 1912 టోల్–ఫ్రీ హెల్ప్‌లైన్‌ను 24 గంటలూ అందుబాటులో ఉంచారు. వర్షాకాల రద్దీని తట్టుకునేలా ఒకేసారి 400 కాల్స్ స్వీకరించే సౌకర్యం ఇందులో కల్పించారు. వినియోగదారులు టీజీఎస్పీడీసీఎల్ సిటిజన్ ఆప్, వాట్సాప్ నంబర్ 87124 41912 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడితే ప్రజలు వాటిని తాకరాదని, వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సంస్థ విజ్ఞప్తి చేసింది.

# రక్తదానం అత్యున్నత మానవ సేవ: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

- **రక్తదాతలే సమాజానికి నిజమైన హీరోలు**
- **ప్రతి ప్రాణాన్ని కాపాడే కరుణకు ఇది ప్రతీక**
- **రాష్ట్రవ్యాప్తంగా రక్తదానాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చాలి**
- **రాజ్‌భవన్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన తెలంగాణ గవర్నర్**

**హైదరాబాద్, వెలుతురు జూన్ 14:**

రక్తదానం అనేది కేవలం ఒక వైద్య ప్రక్రియ మాత్రమే కాదని, అది మానవత్వం, కరుణ మరియు సామాజిక బాధ్యతకు నిదర్శనమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం లోక్‌భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. మానవ సేవలో రక్తదానాన్ని మించిన అత్యున్నతమైనది మరొకటి లేదని, ఒకరి ప్రాణాన్ని కాపాడటం కంటే గొప్ప కరుణా గుణం ఇంకొకటి ఉండదన్నారు. దానం చేసిన ప్రతి రక్తపు బొట్టు, అత్యవసర స్థితిలో ఉన్న రోగులకు సరికొత్త ఆశను, ధైర్యాన్ని, బతికే అవకాశాన్ని ప్రసాదిస్తుందని కొనియాడారు.భారతీయ సంస్కృతిలోనే దానగుణం, నిస్వార్థ సేవ దాగి ఉన్నాయని, ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా గుర్తుతెలియని వ్యక్తుల ప్రాణాలను కాపాడే రక్తదాతలే సమాజానికి నిజమైన హీరోలని గవర్నర్ ప్రశంసించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో ఆయన స్వచ్ఛంద రక్తదాతల సేవలను అభినందించారు. ఈ ఏడాది ప్రపంచ రక్తదాతల దినోత్సవ నినాదం "ఒక మానవత్వపు చుక్క – రక్తాన్ని ఇవ్వండి, ప్రాణాలను కాపాడండి" అనే అంశాన్ని ప్రస్తావిస్తూ.. రక్తదానం అనేది భాష, ప్రాంతం, కులం, మతాల సరిహద్దులను అధిగమించి మానవత్వపు ఉమ్మడి విలువలను చాటుతుందని చెప్పారు. ఈ ఉద్యమాన్ని గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు మరియు యువజన సంఘాలకు విస్తరించాలని యువత, మహిళలు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.ఇదే సందర్భంలో



క్షయవ్యాధి (టీబీ) లేని, డ్రగ్స్ లేని తెలంగాణను నిర్మించేందుకు తన నిబద్ధతను గవర్నర్ పునరుద్ఘాటించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్ మాట్లాడుతూ.. గవర్నర్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి టీబీ నిర్మూలన, మాదకద్రవ్యాల నివారణ, రెడ్ క్రాస్ సేవల విస్తరణకు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల రెడ్ క్రాస్ సొసైటీలో 5,000 మందికి పైగా కొత్త సభ్యులు చేరారని వెల్లడించారు. అనంతరం తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీకి సహకరించిన వైద్యులకు, తరచూ రక్తదానం చేసే వారికి, శిబిరాల నిర్వాహకులకు, కార్పొరేట్ భాగస్వాములకు గవర్నర్ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు.అంతకుముందు, ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీని గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు. లార్వెన్ ఫార్మా సహకారంతో జరిగిన ఈ ర్యాలీ మరియు రక్తదాన డ్రైవ్‌లో సుమారు 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, వాలంటీర్లు పాల్గొని నగర వీధుల్లో రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎ. శ్రీరాములు, ట్రెజరర్ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శశికిరణాచారి, లార్వెన్ గ్రూప్ ఎండీ వరుణ్ విహార్, సీఈఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# "సోషల్ మీడియా ఆవేశం సరిపోదు.. అది స్ట్రీట్ ఫైట్‌గా మారాలి!"

- **నిరుద్యోగం, పేపర్ లీకేజీలపై యువత వీధి పోరాటాలకు సిద్ధం కావాలి**
- **పొద్దున్నే లేస్తే ఈమెయిల్స్‌తో ఊడుతున్న ఐటీ ఉద్యోగాలు**
- **దేశంలో 20 శాతానికి చేరిన నిరుద్యోగిత రేటు**
- **నీట్, సీబీఎస్ఈ లీకేజీలపై విద్యాశాఖ మంత్రికి కనీస నైతిక బాధ్యత లేదా?**
- **మాకు ఉచితాలు వద్దు, సరైన అవకాశాలిస్తే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను మేమే సాధిస్తాం**
- **కాక్రోచ్ జనతా పార్టీ నిరసన ప్రదర్శనలో ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ ధ్వజం**

**హైదరాబాద్, వెలుతురు జూన్ 14:**

దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, నిరంతర పేపర్ లీకేజీలపై సోషల్ మీడియా వేదికలకే పరిమితం కాకుండా యువత వీధి పోరాటాలకు సిద్ధం కావాలని ప్రముఖ విద్యావేత్త, రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ పిలుపునిచ్చారు. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ నిరసన ప్రదర్శనలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. కేవలం సోషల్ మీడియా యాప్స్‌లో పోస్టులు పెట్టి ఆవేశపడితే సరిపోదని, ఆ డిజిటల్ ఆగ్రహం కాస్తా రోడ్ల పైకి వచ్చి పోరాటాలుగా మారినప్పుడే ప్రభుత్వాలు దిగివస్తాయన్నారు. చిలీ దేశంలో కేవలం 30 పైసల మెట్రో ఛార్జీల పెరుగుదలపై విద్యార్థులు చేసిన తిరుగుబాటు అక్కడ ప్రభుత్వాలనే గద్దె దించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ఐటీ ఉద్యోగాల కోత, పేపర్ లీకేజీలు, ధరల పెరుగుదల, పాలకుల బాధ్యతారాహిత్య వైఖరిపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గత కొన్ని నెలలుగా నీట్ సీబీఎస్ఈ వంటి దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక పరీక్షల ప్రశ్నపత్రాలు వరుసగా లీక్ అవుతున్నా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కనీస నైతిక బాధ్యత వహించడం లేదని ప్రొఫెసర్ నాగేశ్వర్ విమర్శించారు. "గతంలో రైల్వే ప్రమాదం జరిగినప్పుడు అప్పటి రైల్వే మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి నైతిక బాధ్యతతో రాజీనామా చేశారు. కానీ నేడు విద్యావ్యవస్థ మొత్తం భ్రష్టు పడుతున్నా పాలకులు కదలడం లేదు. ఈ వ్యవస్థలో పొలిటికల్ అకౌంటబిలిటీ పూర్తిగా లోపించింది" అని మండిపడ్డారు. పాలకులలో ఈ జవాబుదారీతనాన్ని ప్రశ్నించి రాబట్టే శక్తి ఒక్క యువతకే ఉందన్నారు. దేశంలో యువత నిరుద్యోగిత రేటు 20 శాతానికి చేరిందని, క్యాంపస్ సెలక్షన్స్ లేక విద్యావంతులైన యువతీ యువకులు అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఒకవైపేమో బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తుంటే, మరోవైపు సామాన్య ఐటీ, ప్రైవేట్ ఉద్యోగులకు పొద్దున్నే లేవగానే 'మీ ఉద్యోగం పోయింది' అంటూ ఈమెయిల్స్ వస్తున్నాయని నాగేశ్వర్ ధ్వజమెత్తారు. "కంపెనీల నుంచి కనీసం థాంక్యూ చెప్పే సంస్కారం కూడా లేకుండా, ఇంత అవమానకరంగా ఉద్యోగాల నుండి తీసేస్తున్నారు. మాకు ఉచితాలు వద్దు, మేము పరాన్నజీవులం కాదు. కష్టపడి పనిచేసే కాక్రోచులం. మాకు సరైన ఉద్యోగ అవకాశాలు ఇస్తే మేమే దేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు నడిపిస్తాం" అని యువత తరఫున ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పాలకుల స్పందన హాస్యాస్పదంగా మారిందని, ఉల్లిగడ్డల ధరలు పెరిగాయని అడిగితే 'నేను ఉల్లిగడ్డలు తినను' అనడం, పెట్రోల్ ధరలపై




ప్రశ్నిస్తే 'బంగారం కొనడం మానేయండి' అనడం పాలకుల అహంకారానికి నిదర్శనమన్నారు. మహిళలపై జరుగుతున్న ఘోర అత్యాచారాలను అరికట్టాల్సింది పోయి, బాధితులనే ప్రశ్నించే ధోరణి రాజకీయ వ్యవస్థల్లో పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే వారిపై పాలక వర్గాలు 'అర్బన్ నక్సలైట్లు', 'దేశద్రోహులు' అంటూ ముద్రలు వేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "మమ్మల్ని దేశద్రోహులు అనేవారికి ఒక్కటే చెప్పదలుచుకున్నాం.. మేము భరతమాత ముద్దుబిడ్డలం, భగత్ సింగ్ తమ్ములం. దేశభక్తి అనేది పాలకుల సొత్తు కాదు, నిజమైన దేశభక్తులం మేమే" అంటూ సభలో పాల్గొన్న వేలాది మంది యువతతో 'భారత్ మాతా కీ జై' అని నినాదాలు చేయించారు. భారత రాజ్యాంగ పీఠికలోనే 'వి ద పీపుల్ ఆఫ్ ఇండియా' అని ఉందని గుర్తు చేస్తూ, ఇవాళ ప్రజలే సుప్రీం అని పాలకులకు అర్థమయ్యేలా చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. "బతకాలంటే చావడం నేర్చుకోవాలి.. అడుగడుగున పోరాటం నేర్చుకోవాలి! (జీనా హైతో మర్నా సీఖో.. కదమ్ కదమ్ పర్ లడ్నా సీఖో)" అని యువతకు పిలుపునిచ్చారు. జనాగ్రహం గనుక కట్టలు తెంచుకుంటే దేశంలో మరో పెద్ద యువజన ఉద్యమం రావడం ఖాయమని, ఈ వ్యవస్థ మారేంతవరకు అంతిమ విజయం సాధించేలా పౌర సమాజం చైతన్యంతో ముందుకు సాగాలని ప్రొఫెసర్ నాగేశ్వర్ పిలుపునిచ్చారు.

# 181 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చిన విజయ్ దేవరకొండ



ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థులు చదువులో రాణిస్తారని సినీ నటుడు విజయ్ దేవరకొండ (Vijay Devarakonda) అన్నారు. ఆదివారం నాగర్ కర్నూలు జిల్లా బల్మూర్ మండల పరిధిలోని తుమ్మనపేట గ్రామంలో విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. 'ద విజయ్ దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విజయ్, రష్మిక దంపతులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులు సాధించారని వారిని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో నాగర్ కర్నూల్ జిల్లా రెండో స్థానంలో నిలిచిందని, ఇందుకు డీఈవో, ఉపాధ్యాయుల కృషి ఎంతో గొప్పదని అన్నారు. నియోజకవర్గంలోని 45 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9, 10 తరగతి విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. ప్రథమ స్థానంలో మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10,000, ద్వితీయ స్థానంలో మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5,000 చొప్పున మొత్తం 181 మంది విద్యార్థులకు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డీఈవో రమేష్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు, విజయ్ దేవరకొండ తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# 'నాగబంధం'.. 3 గంటల 15 నిమిషాల నిడివి ఎక్కువేనా?



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న మైథలాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్'. ఇటీవల ప్రేక్షకుల్లో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న తెలుగు చిత్రాలలో ఇది ఒకటి. నభా నటేశ్, ఐశ్వర్య మేనన్ ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. జులై 3న విడుదల కానున్న ఈ సినిమా.. అద్భుతమైన విజువల్స్‌తో మంచి హైప్‌ను సృష్టిస్తోంది. 'నాగబంధం' సుమారు 3 గంటల 15 నిమిషాల నిడివితో విడుదలకు సిద్ధమవుతోంది. సాధారణంగా ఇది కాస్త ఎక్కువగా అనిపించినప్పటికీ.. సినిమా కథాంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే పెద్ద సమస్య కాదు. మిస్టరీ, పురాణ గాథలు, నిధులు, సాహసయాత్ర ప్రధానాంశాలుగా కథ సాగుతుంది. కంటెంట్ ఆకట్టుకునేలా ఉండడంతో ఈ నిడివి చిత్రానికి సానుకూలంగా మారే అవకాశం ఉంది. 2026 ఫిబ్రవరి 15న టీజర్ విడుదలై సానుకూల స్పందన లభించడంతో ప్రేక్షకులలో అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంలో జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్షా నాగర్కర్, రిషబ్ సాహ్నీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# డ్యూడ్ 2 సన్నాహాలు

'దేవదాస్ సార్..' అంటూ 'డ్యూడ్' సినిమాతో కుర్రకారుని అలరించింది మలయాళ భామ మమితా బైజు. ఆమె, హీరో ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన చిత్రమిది. కీర్తిశ్వరన్ దర్శకత్వం వహించారు. ప్రేమ, స్నేహం లాంటి అంశాలతో రూపొందిన ఈ చిత్రంలో మమిత, ప్రదీప్‌ల జోడీ ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. గతేడాది విడుదలై యువతను విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమాకి.. ఇప్పుడు సీక్వెల్‌ను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు కీర్తిశ్వరన్ 'డ్యూడ్ 2' గురించి మాట్లాడుతూ.. ''ఈ కొనసాగింపు చిత్రం గురించి ప్రదీప్ రంగనాథన్‌కు ఓ ఆలోచనను చెప్పాను. ఈ కథాలోచన అనుకున్నట్లుగా కార్యరూపం దాల్చితే.. సీక్వెల్‌ను త్వరలోనే పట్టాలెక్కిస్తాం'' అని అన్నారు. ప్రస్తుతం మమిత ఖాతాలో 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'ఇరండు వానం' తదితర చిత్రాలున్నాయి.





# మహిళల టీ20 ప్రపంచకప్

- పాక్‌పై భారత్ విశ్వరూపం
- 64 పరుగుల తేడాతో ఘనవిజయం!

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు విజయభేరి మోగించింది. సాంప్రదాయ ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన హై-వోల్టేజ్ సమరంలో టీమిండియా 64 పరుగుల భారీ తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్‌లో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన క్లాస్ ఇన్నింగ్స్, రిచా ఘోష్ మెరుపు హిట్టింగ్‌తో భారత్ కొండంత లక్ష్యాన్ని నిర్దేశించగా.. అనంతరం బౌలింగ్‌లో దీప్తి శర్మ 'ఐదు' వికెట్ల పంజాతో పాక్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చింది. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లోనే లభించిన ఈ భారీ గెలుపుతో భారత్ తన సెమీఫైనల్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకుంది.

### మంధాన హాఫ్ సెంచరీ.. ఆఖర్లో రిచా ఘోష్ విధ్వంసం


టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ప్రారంభంలోనే గట్టి షాక్‌లు తగిలాయి. ఓపెనర్ షెఫాలీ వర్మ (6), జెమిమా రోడ్రిగ్స్ (1) తక్కువ పరుగులకే అవుట్ కావడంతో భారత్ ఒత్తిడిలో పడింది. ఈ క్లిష్ట సమయంలో బాధ్యతాయుతంగా ఆడిన స్మృతి మంధాన (44 బంతుల్లో 68; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుత అర్ధశతకంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. ఆమెకు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (36) చక్కని సహకారం అందించింది. ఇక ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లలో వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ (కేవలం 17 బంతుల్లో 34; 5 ఫోర్లు, 1 సిక్స్) మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాక్ బౌలర్లలో ఫాతిమా సనా, సాదియా ఇక్బాల్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

### దీప్తి శర్మ 'ఫైఫర్'.. 106 పరుగులకే పాక్ ఆలౌట్

171 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్‌కు భారత బౌలర్లు మొదటి ఓవర్ నుంచే చుక్కలు చూపించారు. ఓపెనర్ మునీబా అలీ (41) ఒంటరి పోరాటం చేసినప్పటికీ, మిగిలిన బ్యాటర్లు భారత స్పిన్ దాడికి చేతులెత్తేశారు. ముఖ్యంగా స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ తన కెరీర్ బెస్ట్ బౌలింగ్ స్పెల్‌తో (4 ఓవర్లలో 10 పరుగులిచ్చి 5 వికెట్లు) పాక్ నడుం విరిచింది. ఆమెకు తోడుగా యువ బౌలర్ శ్రీ చరణి 3 వికెట్లతో చెలరేగడంతో పాకిస్తాన్ జట్టు 17 ఓవర్లలో కేవలం 106 పరుగులకే కుప్పకూలింది. ఊహించని స్పెల్‌తో పాక్‌ను కట్టడి చేసిన దీప్తి శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

# ఉత్కంఠ పోరులో ఆస్ట్రేలియా విజయం

**బంగ్లాదేశ్‌పై వికెట్ తేడాతో గెలుపు!**



మిర్పూర్‌లోని షేర్-ఎ-బంగ్లా నేషనల్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఊపిరి సలపనివ్వని ఉత్కంఠ మధ్య ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. బంగ్లాదేశ్ నిర్దేశించిన 275 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ మరో 3 బంతులు మిగిలి ఉండగానే 9 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆస్ట్రేలియా ఓపెనర్ కూపర్ కానల్లీ (149) అద్భుత సెంచరీతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్ గండం నుండి తప్పించుకోగా, మొదటి రెండు వన్డేలు గెలిచిన బంగ్లాదేశ్ 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 274 పరుగులు చేసింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తౌహిద్ హృదయ్ (83), మోసద్దెక్ హుస్సేన్ (56) అర్ధ సెంచరీలతో రాణించగా, వికెట్ కీపర్ లిట్టన్ దాస్ (58) పరుగులతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో మాట్ రెన్షా, జేవియర్ బార్ట్లెట్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్ కూపర్ కానల్లీ (134 బంతుల్లో 149 పరుగులు, 13 ఫోర్లు, 6 సిక్సర్లు) ఒంటరి పోరాటంతో కొండంత అండగా నిలిచాడు. మార్నస్ లాబుషేన్ (29), కామెరాన్ గ్రీన్ (27) ఆతనికి సహకారం అందించారు.

ఒక దశలో 266/5తో సునాయాసంగా గెలిచేలా కనిపించిన ఆసీస్.. బంగ్లాదేశ్ పేసర్ షరీఫుల్ ఇస్లాం (6/48) కెరీర్ బెస్ట్ బౌలింగ్ ధాటికి వరుస వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. కేవలం 5 పరుగుల వ్యవధిలోనే కూపర్ కానల్లీతో సహా 4 వికెట్లు పడగొట్టి షరీఫుల్ మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. చివరి ఓవర్లో ఆసీస్ విజయానికి 3 పరుగులు కావాల్సి ఉండగా, చేతిలో ఒక్క వికెట్ మాత్రమే ఉంది. బంగ్లా ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడంతో ఆడమ్ జంపా (4 నాటౌట్), రైలీ మెరిడిత్ (2 నాటౌట్) కలిసి జట్టును గెలిపించారు. ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన కూపర్ కానల్లీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించగా, ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన మోసద్దెక్ హుస్సేన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది.

# వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు విజయమే ముఖ్యం

**టీమిండియా డ్రెస్సింగ్ రూమ్ సంస్కృతిపై గవాస్కర్ ప్రశంసలు!**

ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు సాధించిన 7 వికెట్ల ఘన విజయంపై లెజెండరీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ఈ మ్యాచ్‌లో ఆటగాళ్ల వ్యక్తిగత ప్రదర్శన కంటే, స్వార్థం లేని జట్టు సమష్టి తత్వమే తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు. మ్యాచ్ ముగింపు దశలో శుభ్‌మన్ గిల్ తన సెంచరీకి దగ్గరగా ఉన్నప్పటికీ, కేఎల్ రాహుల్ జట్టు విజయాన్ని త్వరగా పూర్తి చేయడానికే ప్రాధాన్యత ఇస్తూ దూకుడుగా ఆడాడని గవాస్కర్ గుర్తుచేశారు. ఈ ఒక్క సంఘటన ప్రస్తుత టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న అద్భుతమైన క్రీడా సంస్కృతికి అద్దం పడుతోందని ఆయన కొనియాడారు.



ఈ మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో భారత్‌కు సవాల్ విసిరిన అఫ్ఘాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని గవాస్కర్ ప్రత్యేకంగా అభినందించారు. గుర్బాజ్‌ను అవుట్ చేయడానికి నితీష్ సంధించిన పర్‌ఫెక్ట్ యార్కర్ మ్యాచ్‌కే టర్నింగ్ పాయింట్‌గా నిలిచిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇలాంటి పర్‌ఫెక్ట్ యార్కర్లు వేయగలిగితే జట్టుకు అద్భుతమైన ఆస్తిగా మారవచ్చని హితవు పలికారు. హార్దిక్ పాండ్యా అందుబాటులో లేని ప్రస్తుత తరుణంలో ఐదో లేదా ఆరో బౌలర్ కోటాను భర్తీ చేస్తూ నితీష్ రాణించడం సెలెక్టర్లకు పెద్ద ప్లస్ పాయింట్ అని ఆయన అభిప్రాయపడ్డారు.

అలాగే ఈ మ్యాచ్ ద్వారా వన్డేల్లోకి అరంగేట్రం చేసి 3 వికెట్లతో మెరిసిన యువ పేసర్ గుర్నూర్ బ్రార్ బౌలింగ్‌ను కూడా గవాస్కర్ ప్రశంసించారు. తొలి మ్యాచ్ ఆడుతున్నప్పటికీ గుర్నూర్ చూపించిన లైన్ అండ్ లెంగ్త్ కంట్రోల్, గంటకు 140 కిలోమీటర్ల వేగం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. మంచి ఎత్తు, వేగంతో పాటు బ్యాటర్లను ఇబ్బంది పెట్టే అద్భుతమైన శైలి ఆయన సొంతమని పేర్కొన్నారు. భారత ఫాస్ట్ బౌలింగ్ బెంచ్ బలం రోజురోజుకూ పుంజుకుంటోందనడానికి గుర్నూర్ ఒక మంచి సంకేతమని గవాస్కర్ వ్యాఖ్యానించారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com